
వరి, పత్తి దెబ్బతిన్నది...



చెవుల తిరుపతిరావు, రైతు నేరడ, చింతకాని మండలం

వరి 6 ఎకరాలు, పత్తి 8 ఎకరాలు వేశాను. ఎకరానికి రూ.35 వేలకు పైన ఖర్చుపెట్టా. పొలాలకు నీరులేదు. సాగర్ నిండింది నీళ్లు వదిలారు కదా పంటలు బాగుంటాయనుకున్నాం. కానీ ఇలా గండ్లుపడి అసలు నీరు రాకుండా ఉంటుందనుకోలేదు. వరిపొలం ఎదుగుతున్న తరుణంలో నీరు లేని పరిస్థితి. పత్తి కూడా అధికవేడితో బెట్టబోయి కాత, పూత కనిపించడంలేదు. నీళ్లంటే తడిపెట్టి కొంతపైపాటుచేసి ఎరువువేయడం ద్వారా కొంత పనికివచ్చేది. పత్తి పొలాలన్నీ బెట్ట వారిపోతున్నాయి. కళతప్పాయి.

ఆరెకరాలు ఎండిపోతోంది...



లొడంగి వెంకన్న, నేలకొండపల్లి

ఆరు ఎకరాల్లో వరి పంటవేశా. రూ.లక్షకు పైగా ఖర్చుపెట్టా. వరదతో పొలం నీటమునిగింది. తర్వాత వరద నీరు తగ్గింది. సాగర్ ఆయకట్టు కింద నీరు వెంటనే ఇచ్చి ఉంటే తిరిగి పొలం కోలుకునేది. నీరు లేక ఎండిపోతోంది. పొలం అంతా నెర్రెలు వచ్చింది. కాలువకు గండ్లుపడడంతో నీరు రాక ఎండిపోతోంది. మా బాధను అర్థంచేసుకుని నీళ్ల త్వరగా ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలి.

వరిపొలం పాడైపోతోంది...



డి.నర్సింహారావు, దిద్దుపుడి, కొణిజర్ల మండలం

ఎకరంన్నరలో వరి పంటవేశా. వర్షంలేదు. సాగర్ నీరు రావడం లేదు. పొలమంతా బీటలు వారింది. నాది సొంత పొలం. దుక్కులకు విత్తనాలు, నాటు వేసినందుకు, ఎరువులకు రూ.20వేల వరకు పెట్టుబడి పెట్టా. నీరు రాకపోతే వేసిన పంటంతా పోయినట్టే. ప్రభుత్వం త్వరగా సాగర్ నీరు విడుదలచేయాలి. వర్షాలతో కొందరు పంటలు నష్టపోతే, సాగర్‌లో నీరు రాక మేం పంటలు కోల్పోతున్నాం. మమ్ములను కూడా ప్రభుత్వం ఆదుకోవాలి.

15 ఎకరాలు ఎండిపోతోంది..



జాస్తి శ్రీనివాసరావు, కప్పలబంధం, కల్లూరు (మం)

సాగర్ ఆయకట్టు కింద 15 ఎకరాలు సాగు చేశా. నీటి ఎద్దడితో పొట్టదశకు వచ్చిన వరి పైరంతా ఎండి పోయే దశకు చేరుకుంది. సత్వరమే సాగర్ కాల్వపై గండ్లను పూడ్చి సాగునీరు అందించి పంటలను కాపాడాలి. ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో కాల్వ గండ్లు పూడ్చివేతలో జాప్యం జరుగుతోంది. గతేడాది రెండు పంటలను కోల్పోయాం. ఈ ఏడాది సాగర్‌లో నిండుగా నీరు ఉన్నప్పటికీ ఈ పరిస్థితి తలెత్తడం బాధాకరం. ఇప్పటికే ఎకరానికి రూ.30వేలు పెట్టుబడి పెట్టాం.

ఈ నెల ప్రారంభంలో వర్షాలు, వరదల బీభత్సంతో పంటలు నాశనం కాగా, ఇప్పుడు సాగునీరు అందక పంటలు దెబ్బతింటున్నాయి. సాగర్ ఎడమ కాలువకు గండ్లు పడడం, అవి పూడ్చే పనుల్లో జాప్యం జరుగుతుండటంతో సాగునీరు అందక పొలాలు నెర్రెలు బారుతున్నాయి. అధిక వర్షాలతో పాటు మున్నేరు, ఆకేరు పాలేరు, వైరా, కట్టలేరు వరదలతో సుమారు 70 వేల ఎకరాల్లో రైతులు పంటలు కోల్పోగా, ప్రస్తుతం సాగర్ ఆయకట్టు కింద నీరు విడుదల కాక, మరో 70వేల ఎకరాల్లో వరి, పత్తి, మిర్చి పంటలు కోల్పోయే పరిస్థితి కనిపిస్తోంది. వేసిన పంటలకు నీరు లేక వరి పొలాలు బీళ్లువారుతున్నాయి. వరి, పత్తి, మిర్చి పంటలు వెలవెలబోతున్నాయి. కాత, పూత ఎదుగుదల దశలో సాగునీటి ఎద్దడి తీవ్ర ప్రభావం చూపిస్తోంది. దెబ్బమీద దెబ్బ అన్నట్టుగా వర్షాలు, వరదల్లో కొంత పంట నష్టపోతే, ఇప్పుడు సాగునీరు లేక మిగిలిన పంటలు కూడా కోల్పోయే పరిస్థితులున్నాయి.



చింతకాని మండలం కోమట్లగూడెంలో దెబ్బతిన్న వరిపొలాన్ని చూపుతున్న రైతు

ఆంధ్రజ్యోతి విజిట్

కదిలిస్తే చాలు కన్నీటి గోడు

అన్నదాతలకు శాపంగా మారిన 'సాగర్ కాలువ గండ్లు'

- మొన్న భారీవర్షాలతో, నేడు నీటి ఎద్దడితో రైతుల కష్టాలు
- వరి, పత్తి, మిర్చి పంటలకు తీవ్ర నష్టం
- జోన్-2లోని మండలాల్లో ఎక్కడచూసినా నెర్రెలు బారిన పొలాలే
- బోర్లు, బావులు ఉన్న రైతుల పరిస్థితి కొంత నయం
- పెట్టుబడులు తిరిగిరాకపోతే బతుకు కష్టమంటున్న బాధితులు
- గండ్ల పూడ్చివేతలో జాప్యంపై నిరసన గళం

ఖమ్మం, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పాలేరు ఎడమ కాలువకు నీరు విడుదల కాకపోవడంతో ఆయకట్టులోని 2.60 లక్షల ఎకరాల్లోని పొలాలకు నీటి ఎద్దడి నెలకొంది. కొందరు బోర్లు, బావులున్న చోట పంట పొలాలకు నీళ్ల అందిస్తుండగా, పూర్తిగా సాగర్ నీటిపై ఆధారపడిన రైతులు అయోమయం చెందుతున్నారు. గత 15 రోజులుగా నీరు లేకపోవడంతో ఎండలకు పొలాలు బీటలు వారుతున్నాయి. సాగర్ ఎడమకాలువ కింద ఉన్న కూసుమంచి, ఖమ్మంరూరల్, ముదిగొండ, రఘునాథపాలెం, కొణిజర్ల, చింతకాని, తల్లాడ, వైరా, ఏన్కూరు, కల్లూరు, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరుతో పాటు మధిర నియోజకవర్గంలోని పలు మండలాల్లో ఇదే దుస్థితి నెలకొంది. వరి వేసిన నెలరోజుల తర్వాత కలుపు తీసి మందులు వేసి దుబ్బుకట్టే తరుణంలో నీరు లేకపోవడంతో దుబ్బు కట్టకుండా బెట్టబారుతోంది. వరిపొలాలు బీటలు వారుతున్నాయి. నీళ్లలో వరి దుబ్బుకట్టి పచ్చగా పెరగాల్సిన పొలాలు ఎండిపోతున్నాయి. ఎకరానికి రూ.15వేల నుంచి రూ.20వేల వరకు కౌలు ఉండగా.. దుక్కులు, విత్తనాలు, నాట్లు ఎరువులు, కలుపు మందులు తదితర ఖర్చు కూడా ఎకరానికి రూ.15నుంచి రూ.20వేల

(మిగతా 7వ పేజీలో)



చింతకాని మండలం నేరడలో ఎండిపోతున్న వరి

యుద్ధప్రాతిపదికన పూర్తిచేయండి

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

కూసుమంచి, సెప్టెంబరు 20: సాగర్ ఎడమకాల్వ గండ్ల పూడ్చివేత పనుల్లో అధికారులు నిర్లక్ష్యం చేయకుండా యుద్ధప్రాతిపదికన నిర్వహించి ఆయకట్టుకు నీరందించాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. కొనసా...గుతున్న సాగర్ ఎడమకాల్వ మరమ్మతుల పేరిట 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి స్పందించిన కలెక్టర్.. మల్లాయిగూడెం వద్ద పనులు జరిగే ప్రదేశాన్ని పరిశీలించారు. కెనాల్ బెడ్ ఆరు మీటర్ల మేరకు పనులు చేయాల్సి ఉండగా, మూడు మీటర్ల వరకు పనులు పూర్తయినట్టు ఇరిగేషన్ సీఈ విద్యాసాగర్ కలెక్టర్‌కు వివరించారు. కెనాల్ బెడ్ పనులు వెంటనే పూర్తిచేసి రైతులకు సాగర్ నీరు అందించాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఈఈ అనన్య, మంగళంపూడి వెంకటేశ్వరరావు, డీఈలు మధు, రమేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి మండలం మల్లాయిగూడెం వద్ద పనులను పరిశీలిస్తున్న కలెక్టర్





కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలి

- ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ఆందోళన

కొత్తగూడెం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం మినీ అంగన్‌వాడీలకు పదోన్నతులను కల్పించి వేతనాల్లో 50శాతం కోత విధించడం తగదని అంగన్‌వాడీ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి చెరుకూరి సీతామహాలక్ష్మి అన్నారు. పెండింగ్ వేతనాలను చెల్లించాలని, వారి సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్(ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ని కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో సుమారు 4వేల మినీ అంగన్‌వాడీ కేంద్రాలను మెయిన్ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేసి టీచర్లకు వేతనం రూ. 13,650లకు పెంచి జీవోను విడుదల చేసిందన్నారు. పెంచిన వేతనం 3నెలలు మాత్రమే అందించి గత 4నెలల నుంచి సగం వేతనాన్ని అందిస్తుందని అన్నారు.

వారికి పదోన్నతులను కల్పించి వేతనాన్ని తగ్గించడం తగదన్నారు. పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని ఎన్నికల డ్యూటీలను అంగన్‌వాడీలకు రద్దు చేయాలని, పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నా వద్దకు జిల్లా సంక్షేమ అధికారి విజేత చేరుకొని సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తామని హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కంచర్ల జమలయ్య, నరాటి ప్రసాద్, నాయకులు మల్లికార్జున్, మోహన్, గొనే మణి, భూక్య లలిత, శ్రీలత, రమాదేవి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

మున్నేరు ముంపు ప్రాంతాలకు రూ.2 కోట్లు

- ధ్వంసమైన రహదారులు, డ్రెయినేజీలు, వీధి దీపాలు, చేతి పంపులకు మరమ్మతులు
- కార్యాచరణ రూపొందించిన నగరపాలక సంస్థ అధికారులు
- ఫలించిన మంత్రి తుమ్మల చొరవ



వరదలకు ధ్వంసమైన రోడ్డు

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 20: ఖమ్మంలో మున్నేరు వరద పోటుతో పరివాహక ప్రాంతంలోని నివాసాలతోపాటుగా ప్రధాన రహదారులు, డ్రైనేజీలు, కల్వర్టులు ధ్వంసమయ్యాయి. ప్రకాశ్‌నగర్ వంతెన దెబ్బతిన్నది. ఇప్పటికే 9,300మంది బాధితులకు రూ.16,500 చొప్పున రూ.14కోట్లు అందించారు. కాగా మున్నేరు వరదల్లో తీవ్రంగా నష్టపోయిన రహదారులు, డ్రైనేజీలు, వీధి దీపాలు, ఇతర మరమ్మతు పనులు చేపట్టేందుకు ఖమ్మం నగర పాలక సంస్థకు ఆర్థిక ఇబ్బందులు ఏర్పడ్డాయి. దీంతో స్పందించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేఎంసీ పాలకవర్గంపై ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వం నుంచి ప్రత్యేకంగా రూ.2 కోట్లు మంజూరు చేయించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 22ను విడుదల చేసింది. నిధులు మంజూరు జరిగాయి.

దీంతో ఖమ్మం నగరంలో మున్నేరు పరివాహక ప్రాంతం, భారీ వర్షాలకు దెబ్బతిన్న 14 కార్పొరేషన్‌లకు అధికారులు నిధులు కేటాయించారు. 14 రహదారులకు మరమ్మతులు, విద్యుత్ వీధి దీపాలకు, చేతి పంపులకు మరమ్మతులు చేపట్టనున్నారు. 10వ డివిజన్‌కు రూ.10లక్షలు, 11వ డివిజన్‌కు రూ.5 లక్షలు, 16వ డివిజన్‌కు రూ.2లక్షలు, 17వ డివిజన్‌కు రూ.5లక్షలు, 28వ డివిజన్‌కు రూ.5లక్షలు, 29వ డివిజన్‌కు రూ.15లక్షలు, 30వ డివిజన్‌కు రూ. 5లక్షలు, 34వ డివిజన్‌కు రూ.5లక్షలు, 35వ డివిజన్‌కు రూ.22లక్షలు, 46వ డివిజన్‌కు రూ.5లక్షలు, 47వ డివిజన్‌కు రూ.10లక్షలు, 48వ డివిజన్‌కు రూ.10లక్షలు, 59వ డివిజన్‌కు రూ.20లక్షలు, 60వ డివిజన్‌కు రూ.25లక్షల చొప్పున నిధులు కేటాయించారు.

ఈ విషయమై కేఎంసీ ఈఈ కృష్ణలాల్ మాట్లాడుతూ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఇచ్చిన ముంపు నివేదికల మేరకు కేఎంసీకి ప్రభుత్వం రూ.2కోట్ల నిధులు మంజూరు చేసిందని తెలిపారు. ధ్వంసమైన రహదారులు, డ్రైనేజీలు, వీధి దీపాలు తదితర పనులకు ఈ నిధులను వెచ్చిస్తామని, త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తవుతుందని తెలిపారు.

'మూడు ముక్కలు' లేనట్టే...



- ఒక్కటిగానే భద్రాచలం మేజర్ గ్రామ పంచాయతీ
- వార్డుల వారీగా ఓటర్ల జాబితాకు తాత్కాలిక బ్రేక్
- పంచాయతీ ఎన్నికల నిర్వహణకు మార్గం సుగమం

భద్రాచలం, సెప్టెంబరు 20: భద్రాచలం మేజర్ గ్రామ పంచాయతీ ఒకటిగా ఉండేందుకు మార్గం సుగమమైనట్టు విశ్వసనీయ సమాచారం. మూడు పంచాయతీలుగా ప్రభుత్వం భద్రాచలాన్ని విభజించడంతో ప్రజలు భద్రాద్రిని ఒక్కటిగానే కొనసాగించాలని గత కొంతకాలంగా డిమాండ్ చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం ప్రజాభీష్టం మేరకే తుది నిర్ణయం ఉంటుందని పలు మార్లు స్పష్టం చేసింది. ఇటీవల వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సైతం భద్రాద్రివాసులు ఏది కావాలనుకుంటే ఆ విధంగానే చేసేందుకు ప్రభుత్వం సంసిద్ధంగా ఉందని ఈ మేరకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరుకు సూచించారు.

కాగా పంచాయతీరాజ్ కమిషనర్ తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘానికి ఇటీవల రాసిన లేఖలో భద్రాచలంలోని మూడు పంచాయతీలు ఒకటిగా, సారపాకలోని రెండు పంచాయతీలను ఒకటిగా విలీనం చేసిన క్రమంలో వార్డుల వారీగా ఓటర్ల జాబితా తాత్కాలికంగా నిలపమని కోరినట్లు వినికిడి. అయితే ఇందుకు సంబంధించిన ప్రక్రియ త్వరలోనే పూర్తిచేసి భద్రాద్రివాసుల మనోభీష్టమైన భద్రాచలం పంచాయతీకి ఎన్నికలు జరిగే అవకాశాలు మెరుగయ్యాయి.

నాడు మూడు ముక్కలు

పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లుకు జూలై 6న గవర్నర్ ఆమోదం తెలపడంతో భద్రాచలం గ్రామ పంచాయతీని మూడు ముక్కలు చేయడంతో భద్రాద్రివాసులు కుదేలయ్యారు. 2022 డిసెంబరు 16న అప్పటి ప్రభుత్వం భద్రాచలాన్ని మూడు, సారపాకను రెండు గ్రామ పంచాయతీలుగా విభజిస్తూ జీవో నెం:45ను జారీచేసింది. భద్రాచలం పంచాయతీని భద్రాచలం, సీతారాంనగర్, శాంతినగర్ గ్రామ పంచాయతీలుగా విభజించి శాసనసభలో బిల్లు పెట్టింది. 2023 ఫిబ్రవరి 11న ఆ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందింది. దీంతో భద్రాద్రివాసులు ఆనాడు తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. రామక్షేత్రాన్ని విభజించడంతో ప్రాముఖ్యతను కోల్పోతుందని ఇది ఒక రకంగా భద్రాద్రి ప్రాశస్త్యాన్ని ధ్వంసం చేయటమేనని ఆనాడు అసెంబ్లీలో భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య స్పష్టం చేశారు. 'మూడు వద్దు భద్రాద్రి ఒక్కటే ముద్దు' అని ఆ నాడు గవర్నర్‌కు వినతిపత్రం సైతం అందజేశారు.

ఈ క్రమంలో పంచాయతీ విభజన బిల్లును అప్పటి గవర్నర్ వెనక్కి పంపడంతో మూడు ముక్కల గండం తొలగినట్టేనని అంతా భావించారు. ఈ క్రమంలో గతేడాది ఆగస్టులో భద్రాద్రి మూడు ముక్కల విభజన రాష్ట్ర కెబినెట్ తీర్మానం ద్వారా ఆమోదం తెలపడంతో మళ్లీ తెరపైకి వచ్చింది. మళ్లీ బిల్లును గవర్నర్ ఆమోదానికి అప్పటి ప్రభుత్వం పంపింది. ఈ నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికలు రావటంతో అటు నాటి పాలకపక్షం, నాడు ప్రధాన పక్షంగా నేడు అధికార పక్షంగా ఉన్న కాంగ్రెస్‌తో సహా ఇతర రాజకీయ పార్టీలన్నీ భద్రాచలంపై ప్రజల మనోగతం మేరకు నిర్ణయం ఉంటుందని స్పష్టం చేశాయి. ఈ క్రమంలో అందరి మనోభీష్టం మేరకు భద్రాచలం ఒక పంచాయతీగానే కొనసాగేందుకు మార్గం సుగమం అవుతుండటంతో భద్రాద్రివాసుల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతోంది.



అలుపెరుగని అన్నల పోరు

- మావోయిస్టు పార్టీ ఏర్పడి నేటికి 20 ఏళ్లు
- 2004లో పార్టీగా పేరు మార్పు
- ఉద్యమ ప్రస్థానంలో ఎన్నో ఆటుపోట్లు
- నేటినుంచి నెలపాటు వార్షికోత్సవాలకు సిద్ధం
- వేదిక కానున్న దండకారణ్యం 7

దేశ విప్లవోద్యమ చరిత్రలో అదో కీలక ఘట్టం. వివిధ రాష్ట్రాల్లో వివిధ పేర్లతో సాయుధ పోరాటం చేస్తున్న విప్లవ సంస్థలు అన్నీ ఒకే గొడుగు కిందకు వచ్చిన రోజు. దేశ నలుమూలల నుంచి రెడ్ కారిడార్ ఏర్పాటు చేయాలని 2004 సెప్టెంబరు 21న అన్ని గెరిల్లా సైన్యాలు మావోయిస్టు పార్టీగా ఏర్పడ్డాయి. ఈ 20 ఏళ్ల ఉద్యమ చరిత్రలో మావోయిస్టు పార్టీ ఎన్నో ఆటుపోట్లు, అవరోధాలను ఎదుర్కొంది. 2024లో మావోయిస్టు పార్టీకి గట్టి ఎదురు దెబ్బలు తగిలాయి. వివిధ ఎన్‌కౌంటర్లల్లో 163 మంది మావోయిస్టులు మృతి చెందారు.

- చర్ల (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా)



చీకటి సూర్యులకు తీపి కబురు

- లాభాల్లో 33 శాతం బోనస్
- ఒక్కో కార్మికుడికి సగటున రూ.1.90 లక్షలు
- తొలిసారి కాంట్రాక్టు కార్మికులకూ వర్తింపు.. రూ.5వేల చొప్పున చెల్లింపు...
- దసరా పండుగ వేళ కార్మిక కుటుంబాల్లో ఆనందం 6

ఎన్‌వోసీ కోసం ఎదురు చూపులు!

భద్రాద్రి డిగ్రీ కళాశాల స్వయం ప్రతిపత్తికి అడుగు దూరం

భద్రాచలం, సెప్టెంబరు 20: భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల పూర్తిస్థాయి స్వయం ప్రతిపత్తికి మరో అడుగు దూరంలో ఉంది. ఈ ఏడాది జూలైలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలకు స్వయం ప్రతిపత్తి హోదా కల్పిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. అయితే స్వయం ప్రతిపత్తి హోదా పూర్తిస్థాయిలో అమలు కావాలంటే కాకతీయ యూనివర్సిటీ నుంచి నిరంభ్యంతర పత్రం (ఎన్‌వోసీ)కావాల్సి ఉంది. ఇందుకోసం కళాశాల అధికారులు, యూనివర్సిటీ అధికారులను ఈ విషయమై ఇప్పటికే కలవగా ఇందుకు సంబంధించిన ఎన్‌వోసీ త్వరలోనే కళాశాలకు చేరే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. 1980లో భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవిర్భవించగా ఏజెన్సీలో ఉన్నప్పటికీ ఈ కళాశాలలో విద్యార్థులకు తరగతి గదులు సరిపడా ఉన్నాయి. డిజిటల్ లైబ్రరీ అందుబాటులో ఉంది. అలాగే తెలంగాణ నాలెడ్జ్ సెంటర్ నిర్వహణ కోసం కంప్యూటర్ ల్యాబ్, ఇంగ్లీషు ల్యాబ్‌తోపాటు ఇతర కంప్యూటర్ విభాగాలకు ప్రత్యేక ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయి. త్వరలో పూర్తిస్థాయి స్వయం ప్రతిపత్తి కళాశాలగా అధికారిక ఆమోదముద్ర లభించనుండటంతో భవిష్యత్తులో విద్యార్థుల కోసం స్థానిక పరిశ్రమల యాజమాన్యాల సహకారంతో స్కిల్ సెంటర్ ఏర్పాటుకు కళాశాల అధికారులు కసరత్తు చేపడుతున్నారు. రాష్ట్రంలోని అత్యుత్తమ 20 కళాశాలల్లో భద్రాద్రి డిగ్రీ కళాశాల ఒకటిగా గుర్తింపు పొందగా ఉమ్మడి జిల్లాలో రెండోస్థానంలో ఉంది. ఈ విద్యా సంవత్సరంలో 720 మంది విద్యార్థులు మొదటి సంవత్సరంలో చేరాల్సి ఉండగా ఇప్పటివరకు 471మంది విద్యార్థులు చేరినట్లు అధికారులు పేర్కొంటున్నారు. కళాశాలలో బాలికల కోసం ప్రత్యేకంగా మౌలిక సదుపాయాలతో ప్రత్యేక గది ఏర్పాటు చేసి అత్యవసర పరిస్థితుల సమయంలో సేద తీరేందుకు ఏర్పాటు చేశారు. ఇదిలా ఉండగా ఈ కళాశాలలో బోధన సిబ్బంది 40 మంది ఉండాల్సి ఉండగా రెగ్యులర్లో తొమ్మిది మంది, కాంట్రాక్టులో నలుగురు, గెస్ట్ ఫ్యాకల్టీలో 30 మంది బాధ్యతలు నిర్వహిస్తున్నారు. కంప్యూటర్ అధ్యాపకుడి పోస్టు ఖాళీగా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా కళాశాల వరండాలో వర్షం వస్తే కురుస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు యూనివర్సిటీ ఫలితాల్లో సైతం మంచి ఫలితాలు సాధించినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

ట్రస్మా అధ్యక్షుడిగా నర్సిరెడ్డి



బర్కత్‌పుర, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర గుర్తింపు పొందిన పాఠశాలల యాజమాన్యాల సంఘం (ట్రస్మా) నూతన అధ్యక్షుడిగా ఎస్.నర్సిరెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్‌లో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి 25 జిల్లాల ట్రస్మా ప్రతినిధులు హాజరై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కె.అనిల్‌కుమార్, కోశాధికారిగా శ్రీకాంత్ రెడ్డి ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి పాపిరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా కొత్త అధ్యక్షుడు నర్సిరెడ్డి మాట్లాడుతూ.. బడ్జెట్ పాఠశాలలను చిన్న పరిశ్రమలుగా గుర్తించాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు.

తహసీల్దార్లను యథాస్థానానికి పంపండి: ట్రెసా

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సమయంలో బదిలీ అయిన తహసీల్దార్లు, డిప్యూటీ తహసీల్దార్లను తిరిగి పూర్వపు జిల్లాలకు బదిలీ చేయాలని తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయీస్ సర్వీసెస్ అసోసియేషన్ (ట్రెసా) రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని కోరింది. ఈ మేరకు శుక్రవారం వివిధ జిల్లాల నుంచి వచ్చిన సుమారు 150 మంది తహసీల్దార్లు, డిప్యూటీ హసీల్దార్లతో కలిసి ట్రెసా ప్రతినిధులు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. రికార్డ్ అసిస్టెంట్ నుంచి తహసీల్దార్ వరకు అన్ని క్యాడర్లలో బదిలీలు చేపడతామని మంత్రి హామీనిచ్చినట్లు ట్రెసా అధ్యక్షుడు వంగ రవీందర్ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే అడుసుమిల్లి కన్నుమూత



జయప్రకాష్ (ఫైల్)

విజయవాడ (వన్‌టౌన్), సెప్టెంబరు 20: తెలుగుదేశం పార్టీ తొలితరం శాసనసభ్యునిగా 1983-85 మధ్య విజయవాడ తూర్పు నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహించిన మాజీ ఎమ్మెల్యే అడుసుమిల్లి జయప్రకాష్ అనారోగ్యంతో శుక్రవారం కన్నుమూశారు. కొన్నిరోజులుగా ఆయన హైదరాబాద్‌లోని ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీలో ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్‌కు సంబంధించిన చికిత్స పొందుతున్నారు. కాగా, జయప్రకాష్ మృతదేహం శుక్రవారం రాత్రి విజయవాడ చేరుకుంది. శనివారం అంత్యక్రియలు నిర్వహిస్తామని ఆయన కుమారుడు శ్రీతిరుమలేష్ తెలిపారు.

'పాలమూరు - రంగారెడ్డి' కేసు విచారణ వాయిదా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులో అవినీతి ఆరోపణలకు సంబంధించిన కేసు విచారణను సుప్రీంకోర్టు మరోసారి వాయిదా వేసింది. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం భారీ అవినీతికి పాల్పడిందని, దీనిపై విచారణకు ఆదేశించాలని కోరుతూ మాజీ మంత్రి నాగం జనార్దన్ రెడ్డి 2019 మార్చి 5న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్ జస్టిస్ సంజీవ్ ఖన్నా నేతృత్వంలోని జస్టిస్ సంజయ్ కుమార్‌ల ద్విసభ్య ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. పిటిషన్‌పై విచారణను మరోసారి నిర్వహిస్తామని ధర్మాసనం తెలిపింది. తదుపరి విచారణను నవంబరు 25కు వాయిదా వేసింది.

తాగి, తాగించి.. వృద్ధురాలిపై అత్యాచారం

మేడ్చల్ టౌన్, సెప్టెంబరు 20: తప్ప తాగారు.. తాగిన సమయంలో తమకు కావాల్సిన వంటకాలు వండిపెట్టే వృద్ధురాలి(65)తోనూ మద్యం తాగించారు. అంతటితో ఆగకుండా ఒకరి తర్వాత మరొకరు ఆ వృద్ధురాలిపై అత్యాచారానికి పాల్పడ్డారు. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ మండలంలోని బండమాదారం గ్రామంలో ఈ ఘోరం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం.. బండమాదారానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మద్యం సేవించేటప్పుడు స్థానికంగా ఒంటరిగా నివసించే ఓ వృద్ధురాలి వద్దకు వెళ్లి వంట చేయించుకుని తింటారు. గురువారం సాయంత్రం కూడా అలానే వచ్చిన ఆ ము గ్గురు.. మద్యం తాగుతూ ఆమెతోనూ తాగించారు. అనంతరం ఆమెపై అత్యాచారం జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. కాగా, నిందితుల్లో ఇద్దరు పోలీసుల అదుపులో ఉండగా మరొకరు పరారీలో ఉన్నట్టు సమాచారం.

చంచల్‌గూడ జైలుకు జానీ మాస్టర్



పోలీసు వాహనంలో జానీ మాస్టర్

హైదరాబాద్ సిటీ/ రాజేంద్రనగర్/నార్సింగి, సెప్టెంబర్ 20 (ఆంధ్రజ్యోతి): అత్యాచారం కేసులో అరెస్టయిన ప్రముఖ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్ అలియాస్ షేక్ జానీ బాషా(42)ను పోలీసులు చంచల్‌గూడ జైలుకు తరలించారు. ఆయన్ను గోవా నుంచి నగరానికి తీసుకొచ్చిన సైబరాబాద్ ఎస్‌వోటీ, నార్సింగి పోలీసులు.. శుక్రవారం మధ్యాహ్నం ఒకటిన్నరకు రాజేంద్రనగర్ సర్కిల్ ఉప్పర్‌పల్లిలోని 13వ అదనపు మెట్రోపాలిటన్ మెజిస్ట్రేట్ కోర్టు రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి ముందు హాజరుపరిచారు. పోలీసులు సమర్పించిన ఆధారాలను పరిశీలించి, ఇరువర్గాల వాదనలూ విన్న న్యాయమూర్తి.. అక్టోబరు 3వ తేదీ వరకు (14 రోజుల) రిమాండ్ విధించారు. అనంతరం జానీ మాస్టర్‌ను అత్తాపూర్ జాయ్ హాస్పిటల్ తీసుకెళ్లి వైద్య పరీక్షలు చేయించిన పోలీసులు.. మధ్యాహ్నం చంచల్‌గూడ జైలుకు తరలించారు. కాగా.. రిమాండ్ రిపోర్టులో పోలీసులు విస్తుపోయే విషయాలను వెల్లడించారు. జానీమాస్టర్ దురుద్దేశంతోనే బాధితురాలిని అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా తీసుకున్నట్లు తెలిపారు. ఆమెకు ఒక ప్రముఖ డ్యాన్స్ షోలో పాల్గొనే అవకాశం రావడంతో 2017లో నగరానికి వచ్చిందని.. తర్వాత జానీ మాస్టర్ వద్ద అసిస్టెంట్ కొరియోగ్రాఫర్‌గా చేరిందన్నారు. 2019, డిసెంబరు 15 నుంచి జానీ మాస్టర్ వద్దే పనిచేస్తూ అల్కాపురికాలనీలో ఉంటోందని.. ఆ సమయంలో ఇద్దరూ ఒక సూపర్‌హిట్ సినిమాకు పనిచేశారని తెలిపారు. ఆ సినిమా పని నిమిత్తం 2020 జనవరి 10న (అంటే చేరిన నెలరోజుల్లోపే) జానీ మాస్టర్, బాధితురాలు, మరో ఇద్దరు సహాయకులు ముంబైకి వెళ్లారన్నారు. ఆ రోజు రాత్రి 12 గంటలకు బాధితురాలిని ఆధార్‌కార్డు, ఇతర డాక్యుమెంట్లు తీసుకొని తన గదికి రావాలని ఆదేశించిన మాస్టర్.. ఆమె గదిలోకి రాగానే గడియపెట్టి అత్యాచారం చేశాడని.. అప్పటికీ బాలిక వయసు 16 సంవత్సరాలని రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు. అందుకే జానీమాస్టర్‌పై పోక్సో చట్టం కింద కూడా కేసు పెట్టినట్టు వెల్లడించారు. హోటల్ గదిలో జరిగినదాని గురించి ఎవరికైనా చెప్తే ఉద్యోగం నుంచి తొలగించడంతోపాటు పరిశ్రమలోనే లేకుండా చేస్తానం టూ బాధితురాలిని జానీమాస్టర్ బెదిరించినట్టు తెలిపారు. భయపడిన బాధితురాలు మిన్నకుండా ఉండిపోవడంతో.. అలుసుగా తీసుకుని షూటింగ్ స్పాట్‌లో, వ్యానిటీ వ్యాన్‌లో తన కోరిక తీర్చాలంటూ బలవంతపెట్టేవాడని, ఒప్పుకోకుంటే దాడి చేసేవాడని పేర్కొన్నారు. చెప్పినట్లు వినకుంటే షూటింగ్ లొకేషన్‌లో అందరి ముందూ అసభ్యకరంగా మాట్లాడి అవమానించేవాడని.. మతం మార్చుకొని తనను పెళ్లి చేసుకోవాలంటూ పలు సందర్భాల్లో ఆమెపై ఒత్తిడి తెచ్చేవాడని వెల్లడించారు. అతని వేధింపులు ఎక్కువ అవడంతో ఆమె సొంతగా పనిచేయడం ప్రారంభించిందని.. దీంతో ఒకరోజు జానీమాస్టర్, ఆయన భార్య ఆమె ఇంటికి వెళ్లారని, అక్కడ బాధితురాలి చెంపపై మాస్టర్ భార్య కొట్టారని.. కొంత మంది గుర్తుతెలియని వ్యక్తులు బాధితురాలిపై దాడికి యత్నించారని పేర్కొన్నారు. తనపై జరుగుతున్న అకృత్యాల గురించి జానీ మాస్టర్ వద్ద పనిచేస్తున్న మరో అసిస్టెంట్ సూచన మేరకు పోలీసులకు ఫిర్యాదు చేసిందని తెలిపారు.

ఓటుకు నోటు కేసు బదిలీకి సుప్రీం తిరస్కృతి!

ఊహాజనిత అంశాలతో పిటిషన్ వేశారని వ్యాఖ్య.. ప్రాసిక్యూషన్ మీద అభ్యంతరం తెలపని పిటిషనర్లు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): ఓటుకు నోటు కేసును వేరే రాష్ట్రానికి బదిలీ చేయడానికి సుప్రీం కోర్టు నిరాకరించింది. స్పష్టమైన ఆధారాలు లేకుండా కేవలం ఊహాజనితమైన అంశాలతో పిటిషన్ వేశారని ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఈ కేసులో పిటిషనర్లు ప్రాసిక్యూషన్‌పై పూర్తి విశ్వాసం వ్యక్తం చేసినందున ఈ కేసు విచారణను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. అలాగే సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో దర్యాప్తు చేయాలన్న పిటిషనర్ల అభ్యర్థనను తోసిపుచ్చింది. ఓటుకు నోటు కేసును మధ్యప్రదేశ్‌కు బదిలీ చేయాలని ఈ ఏడాది జనవరి 31న బీఆర్ఎస్ నేతలు జగదీశ్‌రెడ్డి, మహమ్మద్ అలీ, సత్యవతి రాథోడ్, కల్వకుంట్ల సంజయ్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను శుక్రవారం జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. తెలంగాణ ప్రభుత్వం తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ముకుల్ రోహత్గీ, సిద్ధార్థ్ లూథ్రా, మేనకా గురుస్వామి, పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు ఆర్యమా సుందరం, దామా శేషాద్రి నాయుడు, న్యాయవాది మోహిత్ రావు హాజరయ్యారు. తొలుత ఆర్యమ సుందరం వాదనలు వినిపిస్తూ.. ఓటుకు నోటు కేసును విచారిస్తున్న ఏసీబీ రాష్ట్ర హోంశాఖ పరిధిలో ఉన్నదని, ప్రస్తుతం హోంశాఖ మంత్రిగా కేసులో నిందితుడిగా ఉన్న రేవంత్‌రెడ్డి ఉన్నారని గుర్తు చేశారు. ఏసీబీ, ప్రాసిక్యూషన్, అలాగే అధికారులు ఆయనకే రిపోర్ట్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఏసీబీ ఎవరిని విచారించాలి? ఎవరిని విచారించవద్దు? అనేది హోం మంత్రిత్వ శాఖే నిర్ణయిస్తుందని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. స్వతంత్ర వ్యవస్థ నుంచి ప్రాసిక్యూషన్‌కు స్పష్టమైన ఆదేశాలు ఉండాలని కోరారు. అందుకే.. సుప్రీం విశ్రాంత న్యాయమూర్తికి ప్రాసిక్యూషన్ బాధ్యతలు అప్పగించాలని విజ్ఞప్తి చేశారు.

అన్ని శాఖలు సీఎం పరిధిలోనే

పిటిషనర్ల తరఫున వాదనలపై ధర్మాసనం స్పందిస్తూ.. మీరు చెప్పినట్లు కేసు విచారణను మరోచోటుకు మార్చినప్పటికీ అధికారులు హోం మంత్రికి చెప్పిన తర్వాతే కోర్టుకు వెళతారు కదా? అని ప్రశ్నించింది. హోంశాఖ ఆయన పరిధిలో లేకపోయినా ఒక ముఖ్యమంత్రిగా అన్ని శాఖలు ఆయన పర్యవేక్షణలో పని చేయాల్సిందే కదా? అని ధర్మాసనం పేర్కొంది. అందుకే ప్రాసిక్యూషన్ అనేది స్వతంత్రంగా జరగాలని తాము కోరుతున్నామని ఆర్యమ సుందరం తెలిపారు. సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి నేతృత్వంలో విచారణ కొనసాగినప్పుడే దర్యాప్తు నిజాయితీగా జరుగుతుందన్నారు. ఈ కేసులో ప్రత్యక్ష సాక్షులు, అధికారులను విచారించాల్సి ఉన్నదని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. సుందరం వాదనలకు ముకుల్ రోహత్గీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ కేసులో ఇప్పటికే చాలామంది విచారణ పూర్తయిందని తెలిపారు. రాజకీయ కోణంలోనే పిటిషనర్లు కోర్టును ఆశ్రయించారన్నారు. గతంలో ఈ కేసును విచారిస్తున్న దర్యాప్తు అధికారిని కొనసాగించడం మీకు సమ్మతమేనా? అని పిటిషన్ల తరఫు న్యాయవాదులను ధర్మాసనం ప్రశ్నించింది. వారి నుంచి ఎటువంటి అభ్యంతరం రాలేదు. అలాంటప్పుడు గతంలో ఇదే ప్రాసిక్యూషన్‌పై అనుమానం ఎందుకు వ్యక్తం చేశారని ధర్మాసనం ప్రశ్నించింది. పిటిషనర్లు ప్రాసిక్యూషన్‌పై పూర్తి నమ్మకం వ్యక్తం చేసినందుకు ఈ కేసు విచారణను వేరే రాష్ట్రానికి బదిలీ చేయాల్సిన అవసరం లేదని అభిప్రాయపడింది. ఈ నేపథ్యంలో కేసును మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై విచారణను ముగిస్తున్నట్టు ధర్మాసనం స్పష్టం చేసింది.

రేవంత్‌కు రిపోర్టు చేయాల్సిన అవసరం లేదు

కేసు విచారణలో ఎటువంటి పరిస్థితుల్లోనూ జోక్యం చేసుకోవద్దని రేవంత్‌రెడ్డిని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఇక నుంచి కేసు విచారణను సీఎం రేవంత్ రెడ్డికి నివేదించవద్దని ఏసీబీ డీజీని ఆదేశించింది. ప్రత్యేక ప్రాసిక్యూషన్‌కు పూర్తి స్థాయిలో సహకరించాలని చెప్పింది. ప్రతివాది అయిన సీఎం రేవంత్‌రెడ్డి ఈ కేసు విచారణలో జోక్యం చేసుకుంటే మళ్లీ కోర్టును ఆశ్రయించే అవకాశం కల్పిస్తున్నట్లు పేర్కొంది. ఇదే సందర్భంలో ట్రయల్ కోర్టు కేసు విచారణను పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించింది.

రేవంత్.. క్షమాపణలు స్వీకరిస్తున్నాం

ఢిల్లీ మద్యం కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు సుప్రీంకోర్టు బెయిల్ ఇవ్వడంపై సీఎం రేవంత్‌రెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ గతంలో ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. శుక్రవారం కేసు విచారణ సందర్భంగా మరోసారి ఆ అంశం ప్రస్తావన వచ్చింది. పీసీసీ అధ్యక్షుడిగా రేవంత్‌రెడ్డి ఉన్నారని ఆర్యమ సుందరం ప్రస్తావించగా, రేవంత్‌రెడ్డి స్థానంలో మరొకరిని నియమించారని రోహత్గీ గుర్తు చేశారు. రేవంత్ రెడ్డి ఒకసారి సోషల్ మీడియా వేదికగా, మరోసారి బహిరంగంగా రెండుసార్లు సుప్రీం కోర్టుకు క్షమాపణలు చెప్పారని ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. రాజ్యాంగ బద్ధ హోదాలో ఉన్న వ్యక్తులు జాగ్రత్తగా వ్యవహరించాలని సుప్రీంకోర్టు మరోసారి హితవు పలికింది. "ఇలాంటి అనవసరమైన వ్యాఖ్యలు సరి కాదు. క్షమాపణలను స్వీకరిస్తున్నప్పటికీ కోర్టు ఆదేశాలపై వ్యాఖ్యలు చేసేటప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలని మరోసారి సూచిస్తున్నాం" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది.

ఉపాధ్యాయుల సర్దుబాటు!

- విద్యార్థి, టీచర్ నిష్పత్తిపై సర్కారు దృష్టి
- కలెక్టర్లకు అధికారాలు.. ఉత్తర్వుల జారీ

హైదరాబాద్, సెప్టెంబరు 20 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో ప్రతి 17 మంది విద్యార్థులకు ఒక టీచర్ అందుబాటులో ఉన్నారు. జాతీయ స్థాయితో పోలిస్తే రాష్ట్రంలో ఈ నిష్పత్తి మెరుగ్గానే ఉంది. అయితే కొన్ని పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిలో చాలా వ్యత్యాసం ఉంది. దీన్ని సరిదిద్దాలని సర్కారు నిర్ణయించింది. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్లను సర్దుబాటు చేయాలంటూ పాఠశాల విద్యాశాఖ అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. స్థానిక పరిస్థితులను బట్టి ఎక్కడికక్కడ సర్దుబాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన పూర్తి అధికారాలను ఆయా జిల్లా కలెక్టర్లకు అప్పగించారు. విద్యార్థుల సంఖ్యను అనుసరించి ఆయా పాఠశాలల్లో ఎంత మంది ఉపాధ్యాయులు పనిచేయాలనే విషయమై గతంలో జారీ చేసిన మార్గదర్శకాలను అనుసరించాలని సూచించారు. సాధారణంగా ప్రాథమిక పాఠశాలల్లో 1-10 మంది విద్యార్థులుంటే ఒక టీచర్; 11-60 మంది ఉంటే ఇద్దరు; 90 మంది ఉంటే ముగ్గురు; 120 మంది ఉంటే నలుగురు; 150 మంది ఉంటే ఐదుగురు; 200 మంది విద్యార్థులుంటే ఆరుగురు ఉపాధ్యాయులు ఉండాలి. ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో అయితే విద్యార్థుల సంఖ్యతో పాటు సబ్జెక్టుల వారీగా టీచర్లు ఉండాలి. ఒకే ప్రాంగణంలో ఉన్న రెండు మూడు పాఠశాలలను ఒకే పాఠశాలగా పరిగణించి, అక్కడ పనిచేస్తున్న టీచర్లు, విద్యార్థుల సంఖ్య ఆధారంగా సర్దుబాటు చేస్తారు. వీలైనంత వరకు దగ్గరలోని స్కూళ్లకే ఈ సర్దుబాటు చేస్తారు. అలా సాధ్యం కాకపోతే అదే మండల పరిధిలోని ఇతర పాఠశాలలకు పంపిస్తారు. ఈ నెల 28లోపు ఈ సర్దుబాటు ప్రక్రియను పూర్తి చేయాల్సిందిగా అధికారులు ఆదేశించారు.

జిల్లాలో చిరుజల్లులు

- కామేపల్లి మండలంలో 1.6సెం.మీ. వర్షపాతం నమోదు

ఖమ్మంటౌన్, సెప్టెంబరు 21: జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం సాయంత్రం చిరుజల్లులు పడ్డాయి, దీంతో గత వారంరోజులుగా తీవ్రమైన ఎండలు, ఉక్కపోతతో సతమతమవుతున్న ప్రజలకు కొంత ఉపశమనం లభించింది. జిల్లాలోని కామేపల్లి మండలం లింగాలలో 1.6సెంటీమీటర్ల వర్షపాతం నమోదయింది. అలాగే సింగరేణి, ఏన్కూరు, తిరుమలాయపాలెం, కొణిజర్ల, తల్లాడ, వైరా, మధిర, ముదిగొండ, నేలకొండపల్లి, ఖమ్మంలలో చిరుజల్లులు పడ్డాయి. గత వారం రోజులుగా వాతావరణం ఎండాకాలాన్ని తలపిస్తోంది. ఉదయం నుండే ఎండలు మండిపో యాయి. దీనికతోడు తీవ్రమైన ఉక్కపోత ఉండటంతో ప్రజలు ఎండతో అల్లాడిపోతున్నారు. రాత్రివేళ సైతం ఉక్కపోత తగ్గటం లేదు. ఈ పరిస్థితుల్లో శుక్రవారం కురిసిన చిరుజల్లులతో వాతావరణం చల్లబడటంతో కొంత ఉపశమనం లభించింది.

ఇల్లెందులో భారీ వర్షం

ఇల్లెందుటౌన్, సెప్టెంబరు 20: ఇల్లెందు పట్టణంలో శుక్రవారం ఆకస్మికంగా ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షంతో పాటు పట్టణంలోని నెంబర్‌2బస్తీ జమామసీదు సమీపంలో ఓ భారీ వృక్షంపై పిడుగుపడి చెట్టుకొమ్మలు చెల్లాచెదురయ్యాయి.

జూనియర్ అథ్లెటిక్స్‌లో 15 పతకాలు

చుంచుపల్లి, సెప్టెంబరు20: తెలంగాణ రాష్ట్ర జూనియర్ అథ్లెటిక్ చాంపియన్ షిప్ 2024లో భద్రాద్రి జిల్లా క్రీడాకారులకు 15 పతకాలు వరించాయి. హైదారాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ స్టేడియంలో ముగిసిన ఈ పోటీలలో 30 మంది క్రీడాకారులు ప్రాతనిధ్యం వహించారు. వారిలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన పతకాలు సాధించినట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ కె.మహిధర్, శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు.

చీకటి సూర్యులకు తీపి కబురు



- లాభాల్లో 33 శాతం బోనస్ ప్రకటించిన ప్రభుత్వం
- ఒక్కో కార్మికుడికి సగటున రూ 1.90 లక్షల మేర ప్రయోజనం
- తొలి సారి కాంట్రాక్టు కార్మికులకు వర్తింపు.. రూ.5వేల చొప్పున చెల్లింపు...
- దసరా పండుగ వేళ కార్మిక కుటుంబాలకు ఆనందం

ఆంధ్రజ్యోతి, కొత్తగూడెం/ ఇల్లెందు, సెప్టెంబరు 20 : సింగరేణి కాలరీస్ ఉద్యోగులు, కార్మికులకు 2023-24 ఆర్థిక సంవత్సరం లాభాల్లో 33 శాతం వాటా చెల్లించాలని, కాంట్రాక్టు కార్మికులకు సైతం రూ. 5 వేల చొప్పున సింగరేణి లాభాల్లో బోనస్ గా చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం నిర్ణయించడం పట్ల కార్మికుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. శుక్రవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, కోల్ బెల్ట్ ప్రాంతాల ఎమ్మెల్యేలు ఎంపిలు సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ నేత సమక్షంలో ప్రభుత్వ, సింగరేణి యాజమాన్యం నిర్ణయాలను ప్రకటించాయి. 2023-24 ఆర్థిక సంవత్సరంలో సింగరేణి కాలరీస్ రూ4701 కోట్ల నికర లాభాలు గడించినట్లు అధికారికంగా ప్రకటించారు. వీటిలో 33శాతం రూ. 796 కోట్లు కార్మికులకు ఉద్యోగులకు లాభాల్లో వాటాగా చెల్లించనున్నట్లు వెల్లడించారు. ఫలితంగా ఒక్కో కార్మికుడికి సగటున రూ. 1.90లక్షల మేర ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని పేర్కొన్నారు.

2022-23 ఆర్థిక సంవత్సరంలో రెండు శాతం బోనస్‌ను పెంచి 32 శాతంగా కార్మికులకు లాభాల బోనస్ చెల్లించిన సింగరేణి యాజమాన్యం 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఒక్క శాతం పెంచడం ద్వారా 33 శాతం లాభాల్లో వాటా చెల్లింపులకు పూనుకోవడం గమనార్హం. ఒక్కో కార్మికుడికి గతంలో లభించిన బోనస్ కంటే దాదాపు రూ. 20 వేల వరకు అధనంగా లభించే అవకాశం ఉన్నట్లు భావిస్తున్నారు. అంతేగాక ప్రభుత్వం సింగరేణి చరిత్రలో తొలి సారి కాంట్రాక్టు కార్మికులకు సైతం ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున లాభాల బోనస్ చెల్లించాలని నిర్ణయించడంతో సింగరేణి వ్యాప్తంగా పనిచేస్తున్న దాదాపు 25 వేల మంది కాంట్రాక్టు కార్మికులకు రూ. 5 వేల చొప్పున లభించనున్నాయి. దసరా పండుగ నాటికి కార్మికులకు చెల్లించాలని సింగరేణి యాజామాన్యాన్ని ప్రభుత్వం ఆదేశించింది.

చంద్రబాబు విధానం

1998లో అప్పటి ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు తొలి సారి సింగరేణి కాలరీస్‌లో లాభాల్లో కార్మికులకు వాటా పంపిణీ విధానానికి శ్రీకారం చుట్టారు. ఆ సమయంలో సింగరేణి కార్మికులు నిరవధిక సమ్మెలో కొనసాగుతుండటం బొగ్గు ఉత్పత్తులు స్తంభించిపోవడం ప్రభుత్వ విజ్ఞప్తులను పట్టించుకోక పోవడంతో ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు కార్మికులపై కన్నెర్ర చేశారు. కార్మిక సంఘాలపై నిషేదం పెట్టాల్సి వస్తుందని, నష్టాలు వస్తే వేతనాలు కోతలు విధిస్తామని హెచ్చరించడంతో కార్మిక సంఘాలు కార్మికులు తీవ్రంగా ఆక్షేపించారు. ఈ సమయంలో సమావేశంలో పాల్గొన్న కార్మిక నాయకులు సింగరేణిలో లాభాలు వస్తే కార్మికులకు పంపిణీ చేస్తారా.. అని ప్రశ్నించడంతో చంద్రబాబు నాయుడు సింగరేణి లాభాలు గడిస్తే కార్మికులకు వాటా చెల్లిస్తామని ప్రకటించారు.

అనంతరం 1998-99 ఆర్థిక సంవత్సరంలో నష్టాల ఊబిలో కొట్టుమిట్టాడుతున్న సింగరేణి తొలి సారి రూ 103 కోట్లు లాభాలు గడించడంతో చంద్రబాబు నాయుడు ఇచ్చిన మాట ప్రకారం కార్మికులకు లాభాల్లో 10శాతాన్ని బోనస్ గా చెల్లింపజేశారు. ఆనాటి నుంచి సింగరేణిలో కార్మికులకు లాభాల్లో వాటా చెల్లించే విధానం నిరాటంకంగా కొనసాగుతోంది. కాగా, ప్రభుత్వ నిర్ణయంపై గుర్తింపు కార్మికసంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య హర్షం వ్యక్తం చేశారు. సీఎం సహాయ నిధికి సింగరేణి కార్మికులు విరాళంగా ప్రకటించిన రూ 10.25 కోట్లను వేతనాల నుంచి కోతలు విధించకుండా సింగరేణి యాజమాన్యమే లాభాల నుంచే చెల్లించేందుకు అంగీకరించిందని వాసిరెడ్డి తెలిపారు.

భద్రాద్రిలో ముగిసిన నిమజ్జన ప్రక్రియ

- 1504 విగ్రహాలు నిమజ్జనం

భద్రాచలం, సెప్టెంబరు 20: భద్రాచలంలో గణేష్ నిమజ్జనాలు ముగిసాయి. ఐదు రోజుల పాటు నిరంతరాయంగా నిమజ్జనాలు వివిధ శాఖల సమన్వయంతో నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చిన 1504 విగ్రహాలను శుక్రవారం వరకు నిమజ్జనం చేశారు. వాస్తవానికి గురువారం రాత్రికే నిమజ్జన కార్యక్రమం ముగించినప్పటికీ శుక్రవారం తెల్లవారుజామున వచ్చిన విగ్రహాలను నిమజ్జనం చేసినట్లు అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. అయితే శనివారం స్థానికంగా ఉన్న మరికొన్ని విగ్రహాలు నిమజ్జనం నిమిత్తం వచ్చే అవకాశం ఉండటంతో వాటిని ఆ సమయానికి నిమజ్జనం చేసేందుకు చర్యలు చేపట్టనున్నారు.


డివైడర్‌ను ఢీకొన్న కారు..

సత్తుపల్లిరూరల్, సెప్టెంబరు 20: వినాయక నిమజ్జనం పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణమైన కారు ప్రమాదానికి గురైన సంఘటన సత్తుపల్లి మండలం గంగారంలో గురువారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కాలసాని శ్రీనివాసరావు, బెజవాడ చెన్నకేశవ, ఎం.వెంకటకృష్ణ, దేవేంద్రసాయి మేడిశెట్టివారిపాలెం గ్రామానికి కారులో వెళ్లి వస్తున్నారు. సాయిస్ఫూర్తి ఇంజనీరింగ్ కళాశాల వద్దకు రాగానే అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని పక్కనే ఉన్న పొలం గట్టును తాకి ఆగింది. ఈ ప్రమాదంలో కాలసాని శ్రీనివాసరావుకు తీవ్రగాయాలవ్వగా సత్తుపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు. వివరాలు సేకరించి కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టినట్లు పట్టణ సీఐ టి. కిరణ్ తెలిపారు. కాగా ఇందుకు సంబంధించిన యాక్సిడెంట్ వీడియో ఒకటి సామాజిక మాధ్యమాలలో చక్కర్లు కొడుతుంది.

సాగునీరు అందించి వరి పైరును కాపాడాలి

- కల్లూరులో బిఆర్‌ఎస్, రైతుల ధర్నా


కల్లూరు, సెప్టెంబరు 20: తక్షణమే సాగునీరు అందించి ఎండిపోతున్న వరి పైరును కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ కల్లూరులో శుక్రవారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పలు గ్రామాల రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని చంద్రుపట్ల, పోచారం, తెలగవరం, చెన్నూరు, ముచ్చవరం, వైన్ పురం, మర్లపాడు తదితర గ్రామాలకు చెందిన పలువురు రైతులు తరలివచ్చి స్థానిక జలవనరుల శాఖ డివిజన్ కార్యాలయం ముందు ఒక గంటకు పైగా ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతుల తరుపున బీఆర్ఎస్ నాయకులు కట్టా అజయ్‌కుమార్, పాలెపు రామారావులు మాట్లాడుతూ సాగర్ కాల్వపై పడిన గండ్లను పూడ్చి వేయటంలో ప్రభుత్వం మొద్దునిద్ర పోతుందని విమర్శించారు. సాగునీరు అందించటంలో మరింత జాప్యం జరిగితే కల్లూరు డివిజన్ పరిధిలో వేలాది ఎకరాల వరి పైరు నెర్రలు ఇచ్చి ఎండిపోతుందన్నారు. సాగునీటి ఎద్దడితో రైతులు పడుతున్న అవస్థలపై ప్రభుత్వ పాలకులకు, జిల్లా అధికారులకు ఏ మాత్రం స్పందన లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో పంట పొలాలకు సాగునీరు అందించక పోతే పొట్ట దశకు వచ్చిన వేలాది ఎకరాల వరి పైరు ఎండి పోయి రైతులు తీవ్రంగా నష్ట పోయే అవకాశం ఉందని అన్నారు. ఇదే పరిస్థితి ఉంటే ఇక రైతులు ఆత్మహత్యలే శరణ్యమన్నారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా గత ంలో శ్రీరాం సాగర్ ద్వారా నీళ్లను మళ్లించి పంటలను రక్షించిన ఘనత నాటి సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం తన నిర్లక్ష్య ధోరణిని విడనాడి సాగర్ ఆయకట్టు పరిధిలో ఎండిపోయే దశలో ఉన్న పంటలను కాపాడాలని బిఆర్ఎస్ నాయులు కోరారు. సాగర్ డ్యాంలో నిండ నీరు ఉన్న పంటలకు సాగునీరు అందించే పరిస్థితిలో ఈ ప్రభుత్వం లేదని వారు విమర్శించారు. గండ్లు పూడ్చి సాగునీరు అందించక పోతే మరో సారి తమ ఆందోళనను ఉధృతం చేస్తామని అన్నారు. ఇప్పటికైన ప్రభుత్వం కండ్లు తెరిచి సాగర్ కాల్వ ద్వారా సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. ఈ మేరకు జలవనరులశాఖ సర్కిల్ ఎస్సీ ఆనంద్‌కమార్‌కు రైతాంగాం తరుపున వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, రైతులు లక్కినేని రఘు, కాటంనేని వెంకటేశ్వరరావు, మేకల కృష్ణ, రావి సూర్యనారాయణ, కొరకొప్పు ప్రసాద్, పెద్దబోయన మల్లేశ్వరరావు, కమ్మి, కిషోర్, రవి, గొల్లమందల ప్రసాద్, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.



కల్లూరులో సాగునీటి కోసం ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, రైతులు

ముగ్గురు మంత్రులుండి ఏం లాభం..?

- సీపీఎం అనుబంధ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న నాయకులు

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు20: పాలేరు రిజర్వాయర్ కింది భాగంలో సాగర్ ఎడమ కాలువకు పడిన భారీ గండ్లు సకాలంలో మరమ్మతులు చేపట్టి సాగునీరు అందించడంలో అధికారుల నిర్లక్ష్యం మూలంగా ఖమ్మం జిల్లాలో 2.5 లక్షల ఎకరాల ఆయకట్టులో పంటలు ఎండిపోయే ప్రమాదం దాపురించిందని సీపీఎం అనుబంధ తెలంగాణ రైతుసంఘం నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలువ గండ్లు పూడ్చి సాగునీరు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం తెలంగాణ రైతు సంఘం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ రైతుసంఘం నాయకులు బొంతు రాంబాబు మాట్లాడుతూ భారీ వర్షాలకు దెబ్బతిన్న ఆహార పంటలకు ఎకరాకు 25వేలు, వాణిజ్య పంటలకు 25 వేల రూపాయలు అదనంగా సాగు భూమి వరద తో కోతకు గురైన , ఇసుక మేటలు వేసిన పంటలకు ఎకరాకు 50 వేల రూపాయలు పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో ముగ్గురు క్యాబినెట్ మంత్రులు ఉన్నసకాలంలో గండ్లు మరమ్మతులు చేపట్టలేదన్నారు. మంత్రులు బహిరంగంగా ఇరిగేషన్ అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు కానీ దాని వల్ల రైతులకు జరిగిన నష్టం తిరిగి రాదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం మరమ్మతులుకు ఆదేశించినా సకాలంలో పనులు ప్రారంభం చేయని అధికారులపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు, ఖమ్మం జిల్లాలో వైరా, మధిర సత్తుపల్లి నియోజకవర్గాల పరిధిలో పంటలకు గోదావరి జలాలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు సత్తుపల్లి నియోజకవర్గంలో పంటలు ఎండిపోతుంటే దిక్కుతోచని పరిస్థితుల్లో సాగునీరు కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. ఈ ధర్నాలో రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మాదిరి రమేష్ ,తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు తాతా భాస్కరరావు, వాసిరెడ్డి ప్రసాద్, దగ్గి కృష్ణ, రచ్చా నరసింహారావు, తాళ్లపల్లి కృష్ణ, సుంకర సుధాకర్ ,కొల్లేటి ఉపేందర్, కూచిపూడి మధు, అయినాల రామలింగేశ్వర రావు, శీలం సత్యనారాయణ రెడ్డి, నల్ల మోతు మోహన్‌రావు పాల్గొన్నారు.

కేఎంసీలో దరఖాస్తుదారుల

కిట కిట

- నాలుగో రోజు తగ్గని దరఖాస్తులు
- నేడు ముంపు ప్రాంతాల్లోనే 8 క్యాంపులు
- గతంలో గుర్తించిన బాధితుల తప్పొప్పుల సవరణ

ఖమ్మం సంక్షేమ విభాగం, సెప్టెంబరు 20: మున్నేరు వరద ముంపు బాధితుల జాబితా రోజురోజుకు పెరుగుతోంది. ప్రభుత్వ అధికారుల లెక్కల మేరకు 14 డివిజన్ల పరిధిలోని ముంపు ప్రాంతాల నివాసాల బాధితులకు పరిహారం అందించామని కేఎంసీ అధికారులు చెపుతున్నారు. కాగా మరో వైపు గత నాలుగు రోజులుగా ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయానికి పరిహారం కోరుతూ వందల సంఖ్యలో ముంపు ప్రాంతాల ప్రజలు దరఖాస్తులు చేస్తున్నారు. దరఖాస్తులు చేసే వారిలో ఎక్కువ మంది సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన ఫొటోలను దరఖాస్తులకు జత చేస్తున్నారు. ఒకే ఫొటోను పదుల సంఖ్యలో దరఖాస్తులకు జత చేసి అందిస్తున్నారు. దీంతో దరఖాస్తుదారులతో ఖమ్మం నగరపాలక సంస్థ కిటకిటలాడింది. ఏ విభాగం చూసినా ముంపు ప్రాంతాల ప్రజలే దరఖాస్తులతో కనబడుతున్నారు. ఆయా విభాగాల అధికారులు, ఉద్యోగులకు విధులు నిర్వహించుకునేందుకు ఆటంకం ఏర్పడింది. వివాహం కాని యువతీ,యువకులు సైతం తమ ఆధార్ కార్డు నెంబర్‌తో దరఖాస్తులు ఇవ్వటం గమనార్హం. దరఖాస్తుదారుల తాకిడిని తట్టుకోలేక అధికారులు కేఎంసీలో ఓ బాక్స్ పెట్టి వాటిలో దరఖాస్తులు వేయించారు.

నేడు ముంపు ప్రాంతాల్లోనే 8 క్యాంపులు

మున్నేరు, ఖానాపురం అలుగు ముంపు ప్రాంతాల్లోని బాధితుల కోసం శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు కేఎంసీ అధికారులు ప్రత్యేకంగా క్యాంపులు ఏర్పాటు చేశారు. ఉదయం 10.30 గంటల నుంచి నయాబజార్ కాలేజీ, రామన్నపేట రైతు వేదిక, గీతాంజలి పాఠశాల శ్రీనివాసనగర్, ప్రభుత్వ పాఠశాల రాజేందర్‌నగర్, మహిళా డిగ్రీ కాలేజీ గాంధీచౌక్, ఐటీ హబ్ సెంటర్ ఇల్లెందు క్రాస్ రోడ్డు, యూపీఎస్ పాఠశాల ధంసలాపురం, డీఆర్‌డీపీ కార్యాలయం రాపర్తినగర్ సెంటర్, ఖమ్మం నగరపాలక సంస్థ కార్యాలయంలో సాయంత్రం వరకు ప్రత్యేకంగా క్యాంపులు ఏర్పాటుచేశారు. ఒక్కో క్యాంపులో ఒక బిల్ కలెక్టర్‌తోపాటుగా కంప్యూటర్ ఆపరేటర్‌ను ఇతర సిబ్బందిని కేటాయించారు. ముంపు ప్రాంతాల్లో ఇప్పటికే మంజూరైన పరిహారంపై ప్రజలకు ఉన్న అనుమానాలను నివృత్తి చేయనున్నారు. మంజూరు జరిగిన బాధితుల బ్యాంకు ఖాతాల తప్పొప్పుల సవరణ చేపట్టనున్నారు. కానీ నూతన దరఖాస్తులు స్వీకరించబడవని కేఎంసీ అధికారులు ప్రకటించారు.

విద్యుత్ స్తంభం పై నుంచి పడి...

ముదిగొండ, సెప్టెంబరు 20: విద్యుత్ షాక్ కొట్టి స్తంభం పైనుంచి కిందపడి ఏఎల్ఎంకు తీవ్రగాయాలైన సంఘటన ముదిగొండ మండలం కమలాపురం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. కమలాపురంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ జంపర్ ఇవ్వడం కోసం గంధసిరి ఏఎల్ఎం పున్నయ్య విద్యుత్ స్తంభం ఎక్కగా షాక్‌కు గురై స్తంభంపై నుంచి కిందపడటంతో తీవ్రగాయాలయ్యాయి. పున్నయ్యను చికిత్స నిమిత్తం ఖమ్మం ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు.

ఆమె ఓ గిరిజన మహిళ.. భర్త అనారోగ్యానికి గురికాగా కొత్తగూడెం ఆస్పత్రికి తీసుకువచ్చింది.. అయితే పరిస్థితి విషమించడంతో వరంగల్ ఎంజీఎంకు తీసుకువెళ్లాలని వైద్యులు సూచించారు.. ఏం చేయాలో పాలుపోని ఆమె, ఆటోలో భర్తను తీసుకొని స్వగ్రామం పయనమైంది. అయితే మార్గంమధ్యలోనే అతడు కన్నుమూయడంతో ఆటో డ్రైవర్ వారిని మధ్యలోనే దించి వెళ్లిపోయాడు.. భర్త మృతదేహం వద్ద దిక్కుతోచని స్థితిలో ఆమె విలపిస్తుండగా స్థానిక పోలీసులు మానవతా దృక్పథంతో పంచాయతీ ట్రాక్టర్‌ను ఏర్పాటుచేసి మృతదేహాన్ని పంపించారు. అటవీగ్రామాల్లో గిరిజనుల దయనీయ జీవితాలకు అద్దంపట్టే ఈ సంఘటన భద్రాద్రి జిల్లా ఆళ్లపల్లి మండలం మర్కోడు గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది.



పంచాయతీ బల్లాపై భర్త శవంతో భార్య

దిక్కుతోచని స్థితిలో

భర్త శవంతో...

- నడిరోడ్డుపై గిరిజన మహిళ దయనీయ స్థితి
- ఎస్ఐ చొరవతో స్వగ్రామం తరలింపు

ఆళ్లపల్లి, సెప్టెంబరు 20: ఆళ్లపల్లి మండలంలోని అడవి రామవరం గ్రామానికి చెందిన మడకం ఉంగయ్య (52) ఈ నెల 18న అస్వస్థతకు గురయ్యాడు. దీంతో అడవిరామవరం నుంచి కుటుంబసభ్యులు ద్విచక్ర వాహనంపై మర్కోడుకు వచ్చి, అక్కడి నుంచి 108 అంబులెన్సులో కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న క్రమంలో ఉంగయ్య పరిస్థితి విషమించడంతో శుక్రవారం వైద్యులు వరంగల్ ఎంజీఎంకు రిఫర్ చేశారు. అయితే ఎంజీఎంకు ఎలా వెళ్లాలో తెలియక ఉంగయ్య భార్య దేవమ్మ భర్తతో కలిసి ఆస్పత్రి బయట నిస్సహాయంగా కూర్చుండిపోయింది. ఈ క్రమంలో వారి పరిస్థితిని గమనించిన వ్యక్తి పలకరించగా, తాము ఇంటికి వెళ్లిపోతామని దేవమ్మ చెప్పింది. దీంతో సదరు వ్యక్తి ఆటోను కిరాయికి మాట్లాడి ఇద్దరినీ పంపించాడు. అయితే మార్గంమధ్యలో పరిస్థితి విషమించి ఉంగయ్య ఆటోలోనే కన్నుమూశాడు. ఇది గమనించిన ఆటోడ్రైవర్ మర్కోడు వద్ద ఉంగయ్య శవాన్ని కింద కు దించాడు. అడవి రామవరం వెళ్లడానికి సరైన దారి లేకపోవడంతో తాను తీసుకువెళ్లలేనని చెప్పి అక్కడినుంచి వెళ్లిపోయాడు. దీంతో అక్కడే వున్న పంచాయతీ కార్యాలయం వద్ద గల బల్లాపై భర్త శవాన్ని పడుకోబెట్టి దేవమ్మ అక్కడున్న వారిని సహాయం అర్థించింది. అయితే ఆమెకు తెలుగు రాకపోవడంతో స్థానికులు ఆమె గోడును అర్థం చేసుకోలేకపోయారు.ఈ క్రమంలో మర్కోడులోనే వసతి గృహంలో వుంటూ చదువుకుంటున్న కొడుకు వద్దకు దేవమ్మ వెళ్లి తీసుకువచ్చింది. అతడి ద్వారా వివరాలు తెలుసుకున్న గ్రామస్థులు విషయాన్ని పోలీసులకు తెలియజేశారు. దీంతో ఎస్ఐ రతీష్ పంచాయతీ అధికారులతో మాట్లాడి ట్రాక్టర్‌లో ఉంగయ్య శవాన్ని అడవిరామవరం పంపించారు.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు

ఆంగ్ల భాషపై ప్రత్యేక శిక్షణ

జిల్లాలో 16 పాఠశాలలు ఎంపిక



మామిళ్లగూడెం పాఠశాలలో ప్రత్యేక శిక్షణను ప్రారంభించిన ఏఎంవో రవికుమార్

ఖమ్మం ఖానాపురంహవేలి సెప్టెంబరు 20: కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రత్యేక చొరవతో ఆంగ్ల భాషను మాట్లాడటంలో విద్యార్థులకు ఉన్న భయాలను తొలగించి తమ ఆలోచనలను ఆంగ్లంలో పంచుకొనే విధంగా శిక్షణ కార్యక్రమాన్ని జిల్లాలోని 16 పాఠశాలల్లో ప్రాథమికంగా శుక్రవారం నుంచి ప్రారంభించామని డీఈవో సోమశేఖర శర్మ తెలిపారు. ఆయా పాఠశాలల్లో 6, 7తరగతుల విద్యార్థులకు పాఠశాలలోని ఆంగ్ల ఉపాధ్యాయులు మెంటర్స్ గా ప్రతిరోజు 30నిమిషాలు తరగతులను నిర్వహిస్తారు. ఇందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికను స్పోకెన్ ఇంగ్లిష్ బోధనలో అపార అనుభవము గల స్వచ్ఛంద సంస్థ ద్వారా అందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమ విధివిధానాల గురించి ఎంపికైన ఉపాధ్యాయులకు రెండు విడతలుగా స్వచ్ఛంద సంస్థ ద్వారా ఆన్‌లైన్ పద్ధతిలో అవగాహన కల్పించటం జరిగిందన్నారు. ఇంగ్లిష్ మాట్లాడటంలో విద్యార్థుల స్థాయిలను గుర్తించుటకు ఈ నెల 12న స్పోకెన్ ఇంగ్లిష్ బేస్లైన్ పరీక్ష నిర్వహించి విద్యార్థులను వర్గీకరించి తదనుగుణముగా కార్యక్రమం చేపడతామని పేర్కొన్నారు.

ఎంపికైన పాఠశాలలు: ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలో మామిళ్లగుడెం ప్రభుత్వ పాఠశాల, శాంతినగర్, గాంధీనగర్, మంచుకొండ పాఠశాలలు, పాలేరు నియోజకవర్గంలో తిరుమలాయపాలెం, జలగంనగర్, చింతపల్లి పాఠశాలలు, మధిర నియోజకవర్గంలో కొదుమూరు, మేడేపల్లి, బోనకల్ పాఠశాలలు, వైరా నియోజకవర్గంలో రెబ్బవరం, గుబ్బగుర్తి, కొణిజర్ల పాఠశాలలు, సత్తుపల్లి నియోజకవర్గంలో చిన్న కోరుకొండి, కల్లూరు, అన్నారుగుడెం పాఠశాలలు ఎంపికైనట్టు డీఈవో తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యమే కారణం..

- సాగర్ జలాలను తక్షణమే విడుదల చేయాలి
- సీపీఐ ధర్నా



నీటిపారుదలశాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

ఖమ్మం కలెక్టరేట్, సెప్టెంబరు 20: ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలో పంటలు ఎండి పోతున్నాయని సీపీఐ అనుబంధ తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం అధ్యక్షుడు బాగం హేమంతరావు ఆరోపించారు. సాగునీటిని వదలి పంటలను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. సాగర్ కాలువకు మరమ్మత్తులు చేపట్టడంలో జరిగిన జాప్యం రైతుల పాలిట శాపంగా మారిందని ఆయన తెలిపారు. సాగునీటిని విడుదల చేయాలని ప్రభుత్వ నిర్లక్ష్య వైకరిని నిరసిస్తూ తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో ఎన్నెస్పీ క్యాంప్‌లో నీటి పారుదల కార్యాలయాన్ని శుక్రవారం ముట్టడించారు. కార్యాలయంలోకి చొచ్చుకుని పోయి అధికారులకు తమ సమస్యలను వివరించేందుకు రైతులు ప్రయత్నించగా పోలీసులు రైతులను అడ్డుకున్నారు. సాగర్ కాలువకు గండి పడిందని అధికార యంత్రాంగం నిర్లక్ష్యలతో వ్యవహరించి గండి పూడ్చలేదని ఆరోపించారు. మరమ్మత్తులు చేయడంలో ఆలస్యం కారణంగా ఖమ్మం జిల్లాలో పంటలు ఎండి పోతున్నాయని ఆయన తెలిపారు. నాగార్జున సాగర్ ఆయనకట్టు పరిధిలో జిల్లాలోని 16 మండలాలలో రెండున్నర లక్షల ఎకరాల భూమి సాగు అవుతుందన్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.30 నుంచి 40 వేలు పెట్టుబడి పెట్టారని అధికారుల నిర్లక్ష్యం కారణంగా వేల ఎకరాల పంటలు వడబడి పోయాయని మరికొన్ని చోట్ల ఎండి పోయాయన్నారు. ఎండిపోయిన వంటలకు కూడా పరిహారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతుసంఘం నాయకులు పాల్గొన్నారు.

ముగిసిన జయంత్‌సాయి అంత్యక్రియలు

- నాలుగు రోజుల క్రితం కన్యాకుమారిలో సముద్రంలో మునిగి మృతి



పాల్వంచ, సెప్టెంబరు 20: తమిళనాడు రాష్ట్ర కన్యాకుమారి బీచ్‌లో మంగళవారం సముద్ర స్నానానికి వెళ్లి మృతి చెందిన పాల్వంచ వాసి బత్తిని జయంత్‌సాయి(18) అంత్యక్రియలు స్వగ్రామం బోనకల్లు మండలం నారాయణపురంలో గురువారం రాత్రి ముగిసాయి. వివరాల్లోకెళితే.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణం జ్యోతినగర్‌కు చెందిన బత్తిని సురేష్, లక్ష్మి దంపతుల ఒక్కగానొక్క కుమారుడు జయంత్‌సాయి ఇంజనీరింగ్ చదువు నిమిత్తమై తమిళనాడు రాష్ట్రంలోని కన్యాకుమారి సమీపంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో చేర్పించారు. ఈ నెల 17న కళాశాలకు సెలవు కావడంతో స్నేహితులంతా కలిసి కన్యాకుమారి బీచ్‌కు వెళ్లి సముద్రస్నానానికి దిగారు. ఈ క్రమంలో అకస్మాత్తుగా సముద్రంలో వచ్చిన అలల తాకిడికి జయంత్ సాయి సముద్రంలోకి జారి మృతి చెందాడు. దీంతో కళాశాల యాజమాన్యం కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు ఆ ప్రాంతానికి వెళ్లి లాంఛనాలు పూర్తిచేసుకుని రెండు రోజుల తరువాత గురువారం మృతదేహాన్ని వారి స్వగ్రామానికి తరలించారు. ఒక్కగానొక్క కుమారుడి మృతితో తల్లిదండ్రులు, బంధువుల రోదనలతో నారయణపురంతో పాటు నివాస ప్రాంతం పాల్వంచలో కూడా విషాద చాయలు అలుముకున్నాయి. దసరాకు వస్తానని అందరికీ చెప్పిన జయంత్‌సాయి శవమై రావడంతో స్థానికులు, బంధువులు దిగ్భ్రాంతికి లోనయ్యారు. కాగా ఇదే ఘటనలో చిక్కుకున్న మరో విద్యార్థి సుజాతనగర్ మండలానికి చెందిన సాయితరుణ్ ప్రాణాపాయస్థితినుంచి బయట పడటం విశేషం.

అన్నదమ్ముల మధ్య ఘర్షణ....

- పురుగుల మందు తాగిన తమ్ముడు..

కూసుమంచి, సెప్టెంబరు 20: మండలంలోని లాల్‌సింగ్‌తండాలో వ్యవసాయక్షేత్రంలో బోరునీటి వాడకం విషయంలో అన్నదమ్ముల విషయంలో ఘర్షణ జరిగింది. ఈఘటనలో అన్న, వదినలు ఇష్టం వచ్చినట్లు తిట్టడంతో ఈనెల 17న తమ్ముడు ధారావత్ రామచంద్రు పురుగులమందు సేవించాడు. దీంతో కుటుంబసభ్యులు ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతున్నాడు. ఈమేరకు రామచంద్రు భార్య కమ్లి ఫిర్యాదు మేరకు ధారావత్ బన్ను, భార్య బుజ్జిపై కేసునమోదుచేసినట్లు పోలీసులు తెలిపారు.

వివాహిత అదృశ్యం

కూసుమంచి: మండలంలోని గన్యాతండలో వివాహిత(26) అదృశ్యం అయింది. ఈమేరకు వివాహిత భర్త పోలీసులకు ఫిర్యాదుచేశారు. ఈనెల 11తేదీన ఆసుపత్రికి వెళ్లి వస్తానని ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు బంధువుల, చుట్టుపక్కల ఇళ్లలో వెతికినప్పటికీ కనిపించకపోవడంతో శుక్రవారం ఫిర్యాదు చేయడంతో కేసునమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

క్రైం సమాచారం

భార్యాభర్తలపై దాడిచేసి చైన్ స్నాచింగ్

పెనుబల్లి, సెప్టెంబరు 20: పెనుబల్లి మండలంలో ఒకేరోజు గంట వ్యవధిలో వేర్వేరు ప్రాంతాల్లో శుక్రవారం మోటరుసైకిళ్లపై ఇద్దరు వ్యక్తులు బంగారు గొలుసులు ఎత్తుకెళ్లారు. వీఎంబంజర్‌లో నివాసముంటున్న దంపతులు పిచ్చిరెడ్డి ఈశ్వర్‌రెడ్డి, పద్మలక్ష్మి మధిర నుంచి తిరువూరు మీదుగా ద్విచక్రవాహనంపై వీఎంబంజర్‌కు వస్తుండగా కుప్పెనకుంట్ల గురుకుల పాఠశాల సమీపంలో ఇద్దరు వ్యక్తులు పల్సర్ ద్విచక్రవాహనంపై వచ్చి వారి బైక్ ను ఢీకొట్టారు. ఈశ్వర్‌రెడ్డిపై బైక్ పడిపోగా పద్మలక్ష్మి మెడలోని 16గ్రాముల బంగారు గొలుసును బలవంతంగా తెంపుకొని పరారయ్యారు. కేఎంబంజర్‌కు చెందిన మోదుగుకుమారి మట్టి రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా పల్సర్‌బైక్ వచ్చిన గుర్తుతెలియని వ్యక్తులు ఆమె మెడలోని 20గ్రాముల బంగారు గొలుసును తెంచుకొని పరారయ్యారు. ఈమేరకు బాధితులు ఫిర్యాదు చేయగా రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కె.వెంకటేష్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడు మృతి

నేలకొండపల్లి, సెప్టెంబరు20: మూడు రోజుల క్రితం క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన మండల పరిధిలోని నాచేపల్లి గ్రామానికి చెందిన పరిమి గోపి(23) ఖమ్మంలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. మృతునికి భార్య ఉంది. మృతునికి నెల రోజుల క్రితమే వివాహం జరిగినట్లు గ్రామస్థులు చెప్పారు.

ఉరి వేసుకొని వ్యక్తి ఆత్మహత్య

ముదిగొండ, సెప్టెంబరు 20: ఉరివేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ముదిగొండ మండలం బాణాపురం గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మాదాసు నరేష్(35)అనే వ్యక్తి తన ఇంట్లో ఎవరూ లేని ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు.

నెమలిని అటవీ అధికారులకు అప్పగింత

కూసుమంచి, సెప్టెంబరు 20: మండలంలోని గోపాలరావుపేట గ్రామంలో శుక్రవారం సాయంత్రం గోటు నాగేశ్వరరావు వ్యవసాయక్షేత్రంలో ఎగరలేని స్థితిలో ఉన్న నెమలి, దాని పిల్ల కనిపించాయి. దీంతో రైతు తన కుమారుడు అభిలాష్‌తో కలిసి కూసుమంచి పోలీస్ స్టేషన్‌కు తీసుకరాగా, ఫారెస్ట్ అధికారులకు అప్పగించారు.

విద్యుత్‌షాక్‌తో యువరైతు కన్నుమూత

కారేపల్లి, సెప్టెంబరు20: పక్కచేనుకు సంబంధించిన రైతు కోతులబెడద నుంచి కాపాడుకునేందుకు ముళ్లకంచెకు ఏర్పాటుచేసిన విద్యుత్‌తీగలు తగిలి యువరైతు మృతిచెందిన సంఘటన మండల పరిధిలోని సీతారాంపురం గ్రామపంచాయతీ కొత్తురుతండాలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. కుటుంబసభ్యుల తెలిపిన వివరాల ప్రకారం కొత్తరుతండాకు చెందిన ధారావత్ హరిరాం(36)తన చేలో పనులు చేసేందుకు వెళ్లాడు. ఆసమయంలో కొన్ని కోతులు పత్తిచేలో ఉండగా వాటిని తరుముతున్న తరుణంలో పక్కచేను రైతు బానోత్ బాలు చేనుకు ఏర్పాటుచేసిన ముళ్లకంచెకు ఏర్పాటుచేసుకున్న కంచెకు విద్యుత్ ఉన్నవిషయం తెలియని హరిరాం ప్రమాదవశాత్తు ముళ్లకంచెకు తగిలాడు. దీంతో విద్యుత్‌షాక్‌గురై అక్కడికక్కడే మృతిచెందాడు.

వేర్వేరు కారణాలతో ఇద్దరు మహిళలు..

కూసుమంచి, సెప్టెంబరు 20: కూసుమంచి మండలంలో వివిధ కారణాలతో ఇరువురు మహిళలు మృతిచెందారు. దుబ్బతండాలో ఇచ్చిన అప్పు అడిగినందుకు దాడిచేయడంతో మనస్తాపం చెంది బోడ శాంతమ్మ(68)అనే మహిళ శుక్రవారం ఉదయం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. శాంతమ్మ ఇంటి ఎదురుగా నివాసం ఉంటున్న జర్పుల శివకు కిరాణం సరుకులు అరువు ఇచ్చింది. ఈక్రమంలో ఇచ్చిన అరువు తిరిగి ఇయ్యాలని అడగడంతో బెదిరించి, అనంతరం అతని కుటుంబసభ్యులు జర్పుల ప్రసాద్, భారతితో కలిసి దాడి చేశారు. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఇనుపచువ్వకు ఉరిబిగించుకుని ఆత్మహత్యకు పాల్పడింది.

పొలంలో కలుపు తీసేందుకు వెళ్లిన మహిళారైతును పాము కాటేయడంతో బాదావత్ తులసమ్మ(68)మృతిచెందింది. హట్యతండాకు చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు బాదావత్ వీరన్నకు గట్టుసింగారం గ్రామంలో ఐదెకరాల పొలం ఉంది. శుక్రవారం ఉదయం కలుపు తీసేందుకు వీరన్న తల్లి తులసమ్మను పంపించాడు. దీంతో కలుపు తీస్తుండగా పాముకాటుకు గురయింది. ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు.

కదిలిస్తే చాలు కన్నీటి గోడు

(5వ పేజీ తరువాయి)

వరకు పెట్టుబడి పెట్టారు. ఈ తరుణంలో నీరు లేకపోవడం శాపంగా మారింది. పత్తి, మిర్చి రైతుల పరిస్థితి కూడా ఇలాగే ఉంది. ఇప్పటికే అధిక వర్షాలతో పత్తి పంట కాత, పూత రాలి దెబ్బతినగా.. ఇప్పుడు ఎర్రబడడం, బీటలువారి ఎదుగుదల లోపించడంతో కళ తప్పింది. సాగర్ నీరు వదిలితేనే నీరు పెట్టి ఎరువులు, పురుగు మందులతో పంటలు తిరిగి కోలుకునే పరిస్థితి ఉంది.

గండ్లు పూడ్చితేనే సాగర్ నీరు

సాగర్ ఎడమ కాలువకు పడిన గండ్లు పూడ్చితేనే ఆయకట్టుకు నీరు ఇచ్చే పరిస్థితి ఉంది. సాధ్యమైనంత త్వరగా నీరిస్తామని అధికారులు చెబుతున్నా.. ఇంకా జాప్యం జరిగే అవకాశం ఉంది. పాలేరు 23అడుగులకు గాను భారీవర్షాలతో 32 అడుగులకు పాలేరు రిజర్వాయర్‌లో నీరు పోటెత్తింది. సుమారు 2 లక్షల క్యూసెక్కుల నీరు ప్రవహించడంతో సాగర్ కాలువ మొదటిజోన్‌లో నడిగూడెం మండలం రంగులబ్రిడ్జి వద్ద రెండు చోట్ల భారీగా కాలువకు గండ్లు పడ్డాయి. అలాగే కూసుమంచి మండలంలో రెండోజోన్ పరిధిలో మల్లాయిగూడెం వద్ద కూడా ఎడమ కాలువకు రెండుచోట్ల భారీ గండ్లు పడ్డాయి. అందులో ఒక చోట అండర్ టన్నెల్ కొట్టుకుపోయి కాలువకు ఇరువైపులా గండ్లుపడ్డాయి. వీటికి మరమ్మతులు అధికారులు చకచకా సాగిస్తున్నారు. త్వరగా పూర్తి చేస్తామని చెబుతున్నారు. పనులు పూర్తయితేనే నీటి విడుదలకు అవకాశం ఉంది. ప్రస్తుతం పాలేరు రిజర్వాయర్‌లో 17 అడుగుల వరకు నీరుంది. పాలేరు పాత కాలువకు గండ్లు పడడంతో దానిని పూడ్చి అక్కడ ఆయకట్టు రైతులకు నీరందిస్తున్నారు. ఇది నేలకొండపల్లి, కూసుమంచి మండలాలకు లాభం చేకూర్చనుంది.

రైతు సంఘాల ఆందోళనలు

సాగర్ నీరు విడుదల చేయాలని, మరమ్మతులు వెంటనే పూర్తిచేయాలని పంటలను ఆదుకోవాలని బీఆర్ఎస్‌తోపాటు సీపీఎం, సీపీఐలు, ఎన్డీ, రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు ప్రతిరోజు ఆందోళనలు, ధర్నాలు చేస్తున్నాయి. శుక్రవారం సీపీఎం, సీపీఐ రైతు సంఘాల ఆధ్వర్యంలో వేర్వేరుగా ధర్నాలు నిర్వహించారు. బీఆర్ఎస్ కూడా కొన్ని మండలాల్లో ధర్నా నిర్వహించింది.

అలుపెరుగని అన్నల పోరు

- మావోయిస్టు పార్టీకి 20 ఏళ్లు
- రెడ్ కారిడార్ కోసం ఒకే గొడుగు కిందకు ..

చర్ల, సెప్టెంబరు 20: దేశ విప్లవోద్యమ చరిత్రలో అదో కీలక ఘట్టం. వివిధ రాష్ట్రాల్లో వివిధ పేర్లతో సాయుధ పోరాటం చేస్తున్న విప్లవ సంస్థలు అన్నీ ఒకే గొడుకు కిందకు వచ్చిన రోజు, దేశ నలుమూలల నుంచి రెండ్ కారిడార్ ఏర్పాటు చేయాలని 2004 సెప్టెంబరు 21న అన్ని గెరిల్లా సైన్యాలు మావోయిస్టు పార్టీగా ఏర్పడ్డాయి. ఈ 20 ఏళ్ల ఉద్యమ చరిత్రలో మావోయిస్టు పార్టీ ఎన్నో ఆటు పోట్లు, ఎన్నో అవరోధాలు ఎదుర్కొంది. 2024న మావోయిస్టు పార్టీకి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. వివిధ రాష్ట్రాల్లో జరిగిన ఎన్‌కౌంటర్లల్లో 163 మంది మావోయిస్టులు మృతి చెందారు. మరి కొంత మంది లొంగిపోగా, వందల మంది అరెస్టయ్యారు. ఇన్ని ఎదురు దెబ్బల నడుమ మావోయిస్టు పార్టీ 20 ఏళ్ల వార్షికోత్సవాలకు సిద్ధమైంది. ఇప్పటికే వార్షి కోత్సవాలను విజయవంతం చేయాలని మావోయిస్టు అగ్రనాయకత్వం లేఖలు, కరపత్రాల ద్వారా ప్రచారం చేసింది. నేడు దండకారణ్యం వేదిక కానుంది. వార్షి కోత్సవాలను తిప్పికొట్టేందుకు పోలీసులు అడుగులు వేస్తున్నారు. అడవుల్లో జోరుగా కూబింగ్ చేస్తున్నారు.

ఒకే గోడుకు కిందకు అన్నలు

2004 సంవత్సరం ముందు దేశంలో వివిధ రాష్ట్రాల్లో అనేక ప్రాంతాల్లో విప్లవ సంస్థలు ఉద్యమాన్ని నడిపించేవి. నక్సల్స్, పీపుల్స్ వార్ అగ్రగామిలో ఉండేవారు. అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ఉద్యమ నాయకులు అన్ని సంస్థలను ఒకే గోడుకు కిందకు తీసుకురావాలని నిర్ణయించారు. ఇదే క్రమంలో వివిధ రాష్ట్రాల్లో మంచి పట్టున్న పీపుల్స్ వార్ పార్టీ కూడా ముందుకు వచ్చింది. సుదీర్ఘ చర్చల తరువాత 2004 సెప్టెంబరు 21 న అన్ని గ్రూపులకు ఉన్న పేర్లను తొలగించి మావోయిస్టు పార్టీ ఆఫ్ ఇండియాగా ఏర్పాటు చేశారు. మావోయిస్టు పార్టీ మొదటి లక్ష్యంగా రెడ్ కారిడార్‌ని ఏర్పాటు చేయాలని ముందుకు సాగింది. మావోయిస్టు పార్టీ నాయకుడు గణపతి ఆధ్వర్యంలో పార్టీ దేశ వ్యాప్తంగా విస్తరించింది. అప్పటి నుంచి 2024 జనవరి వరకు మావోయిస్టు పార్టీ ఎదరు లేని పార్టీగా సాగింది.

20ఏళ్లలో ఎన్నో ఆటుపోట్లు, కరోనా దాడి..

ఈ 20 ఏళ్ల ప్రస్థానంలో మావోయిస్టు పార్టీ అనేక ఎదుకు దెబ్బలను ఎదుర్కోంది. నిర్బంధాలు, ఎన్‌కౌంటర్లు, అరెస్టులు, లొంగుబాట్లు ఇలా అన్ని కరాలుగా పార్టీ నష్ట పోయింది. పార్టీని ముందుండి నడిపించిన అగ్రనాయకులు పటేల్ సుధాకర్‌రెడ్డి, మల్లోజుల కోటేశ్వరావు, మాధవ్, శాఖమూరి అప్పారావు, ఇలా ముఖ్యమైన నాయకులు వివిధ కారణాలతో మరణించారు. అలాగే కరోనా కూడా మావోయిస్టుని దెబ్బ తీసింది. తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి హరిభూషన్, భారతక్కతో పాటు సుమారు 30 మంది మావోయిస్టులు కరోనాతో మృతి చెందారు.

ఆదివాసీలకు చేరువై...

2004 నుంచి దండకారణ్యంలో మావోయిస్టు పార్టీ పార్టీ సమాంతర ప్రభుత్వాన్ని నడిపింది. అడవుల్లో ఆదివాసీలు, గిరిజన తెగలకు సహాయ సహకారాలు అందిస్తూ పార్టీ చేరువైంది. ఒకానొక దశలో మావోయిస్టు పార్టీనే ఆదివాసీలు, ఆదివాసీలు మావోయిస్టు పార్టీ అన్న వాదన కూడా వినిపించింది. కాగా మారుతున్న కాలానుగుణంగా పార్టీలో మార్పులు వచ్చాయి. గతంలో 16 రాష్ట్రాల్లో ప్రభావం చూపిన మావోయిస్టు పార్టీ నేడు కొన్ని రాష్ట్రాలకే పరిమిత మైందన్న వాదన కూడా వినిపిస్తోంది. నేడు ఛత్తీస్‌గడ్‌లో బస్తర్ అడవులు, ఏవోబీ, మహారాష్ట్ర, తెలంగాణ సరిహద్దుల్లో మాత్రమే మావోయిస్టుల ఉనికి ఉన్నట్లు తెలుస్తోంది.

దండకారణ్యం కేంద్రంగా..

ఎన్నో అవరోధాల నడుమ మావోయిస్టు పార్టీ 18వ వార్షి కోత్సవాలను చేపట్టేందుకు సిద్ధమైంది. నెల రోజుల పాటు అడవుల్లో ఈ వార్షికోత్సవాలు జరగనున్నాయి. పార్టీ ఆవిర్భావం, ఎదుర్కోన్న సమస్యలను నాయకులు గుర్తు చేసుకొనున్నారు. ఇప్పటికే జగన్, ఆజాద్, అరుణ పేరిట మావోయిస్టులు లేఖలు విడుదల చేస్తున్నారు.

కాగా మావోయిస్టు పార్టీ 20వ వార్షి కోత్సవాలను తిప్పికొట్టేందుకు అన్ని రాష్ట్రాల పోలీసులతో పాటు భద్రాద్రి జిల్లా చర్ల సీఐ రాజువర్మ, ఎస్సై నర్సిరెడ్డితో పాటు ఇతర పోలీసులు అప్రమత్తమయ్యారు. దుమ్ముగూడెం, చర్ల, వెంకటాపురం, వాజేడు అడవుల్లో కూబింగ్ చేస్తున్నారు. అటు మహారాష్ట్ర, ఏవోబీ, చత్తీస్‌గడ్ అడవుల్లో కూబింగ్ సాగుతున్నాయి. .

తెర్రం ఘటనే కొంప ముంచిందా...

2021 ఏడాది ఏప్రిల్ 5మావోయిస్టు నాయకుడు హిడ్మా ప్లాన్ వేసి తెర్రం అడవుల్లో 22 మంది జవాన్లను హతమార్చాడు. ఘటన నేపథ్యంలో మావోయిస్టులు లేకుండా చేస్తామని కేంద్ర మంత్రి అమిత్‌షా ప్రకటించిన విషయం తెలిసిందే. అప్పటి నుంచి మావోయిస్టుల కదలికలు తెలుసుకుంటూ, ప్రత్యేక టెక్నాలజీని పోలీసులు అందిపుచ్చుకున్నారు. ఈఏడాది జనవరి నుంచి మావోయిస్టులపై దాడులు జరుపుతున్నారు. ఈఏడాది వరుస ఎన్‌కౌంటర్లలో సుమారు 163 మంది మావోయిస్టులు మృతి చెందారు. సాగర్, శంకరావు, యేసేబు ఇతర ముఖ్య నాయకులు మృతి చెందారు.

గర్భం దాల్చిన మతిస్థిమితం లేని బాలిక

- గర్తు తెలియని వ్యక్తి దుశ్చర్య

దమ్మపేట, సెప్టెంబరు 20: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట మండలంలో పరిధిలోని ఒక గ్రామంలో మతిస్థితం లేని 17ఏళ్ల ఒక గిరిజన బాలిక గర్భం దాల్చిన సంఘటన శుక్రవారం వెలుగుచూసింది. యువతికి రక్తస్రావం కావటంతో ఈ విషయం తెలిసింది. దీంతో ఆ బాలికను తల్లిదండ్రులు కొత్తగూడెం వైద్యశాలకు తీసుకెళ్లి వైద్యం చేసినట్లు సమాచారం. ఈవిషయంపై ఎస్ఐ సాయికిషోర్ రెడ్డిని వివరణ కోరగా విషయం తమ దృష్టికి వచ్చిందని విచారణ చేస్తున్నట్లు తెలిపారు. డీఎస్పీ టెస్టుకు పంపించటం జరిగిందని, దాని ఆధారంగా చర్యలు తీసుకుంటామన్నారు.

ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి



భద్రాద్రి
కొత్తగూడెం

కొత్తగూడెం, ఇల్లెందు, భద్రాచలం, పినపాక, అశ్వారావుపేట

శనివారం 21 సెప్టెంబరు 2024

పేద వైశ్య కుటుంబాలకు విద్య, వివాహాలకు ఆర్థికసాయం

దమ్మపేట, సెప్టెంబరు 20: పేద ఆర్యవైశ్య కుటుంబాలకు విద్య, వివాహాలకు శ్రీవాసవి ఆర్యవైశ్య విద్యావివాహ సహాయ ట్రస్టు ద్వారా ఆర్థికసహకారం అందిస్తున్నట్లు మాజీ వైస్ ఎంపీపీ, దమ్మపేట ఆర్యవైశ్య సంఘం నాయకుడు దారా మల్లికార్జున రావు తెలిపారు. దమ్మపేటలో శుక్రవారం ఆయన మాట్లాడుతు అవసరమైన వైశ్యకుటుంబాల సభ్యులు విద్య, వివాహాల కోసం దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కోరారు. పేద ఆర్యవైశ్యులకు ఆర్థికంగా సహాయాన్ని అందించటమే లక్ష్యంగా ఈట్రస్టు పని చేస్తుందన్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు సిహెచ్ దేవిప్రసాద్ ఇప్పటికి వరకు 290 మంది విద్యార్థులకు, 15మంది మహిళలకు వివాహ నిమిత్తం రూ.15లక్షల పైగా ఆర్థిక సహాయాన్ని అందించినట్లు తెలిపారు. ఈ సంవత్సరము కూడా ఆర్థిక సహాయాన్ని అందించేందుకు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా కోరారు. ఈనెల 30వ తేదీలోపు దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. వివరాలకు 9848183504, 9848723131, 9848071423, 9440991682 సంప్రదించాల్సిందిగా కోరారు.

విజయం కన్నా.. ప్రయత్నం గొప్పది..

- పాఠశాల స్థాయి క్రీడల్లో వక్తలు
- కొనసాగుతున్న పోటీలు

భద్రాచలం, సెప్టెంబరు 20: భద్రాచలంలోని మండల స్థాయి క్రీడలను భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల మనో వికాసానికి, శరీర ధారుడ్యానికే కాకుండా ఆరోగ్య దిక్సూచని తెలిపారు. అలాగే విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో మంచి నైపుణ్యం సాధించి దేశ భవిష్యత్తుకు తోడ్పాటు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల క్రీడల కన్వీనరు జి.పద్మజ, ఎం.రమేష్, బి.వెంకటేశ్వర్లు, జి. శరత్, జాన్సన్, లక్ష్మీనారాయణ, బి.జయబాబు పాల్గొన్నారు.

●ఇల్లెందుటౌన్, సెప్టెంబరు 20: మండల స్థాయి పాఠశాలల బాలుర క్రీడలు శుక్రవారం స్థానిక సింగరేణి పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించారు. ఇల్లెందు పట్టణ, మండల పరిధిల్లోని వివిధ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొన్నారు. కబడ్డీ, వాలీబాల్, కోకో వంటి క్రీడలను నిర్వహించారు. క్రీడా పోటీలు జరుగుతున్న సందర్భంలోనే వర్షం కురవడంతో క్రీడాపోటీలకు అంతరాయం ఏర్పడింది. వర్షం వెలిసిన అనంతరం క్రీడా పోటీలను కొనసాగించారు. ఈ క్రీడా కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంఈవో కృష్ణయ్యతో పాటు నిర్వహకులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎమ్మెల్యే తెల్లం



చుంచుపల్లిలో కబడ్డి ఆడుతున్న విద్యార్థినులు

అక్రమ వసూళ్లకు పాల్పడలేదు

మండల స్థాయి క్రీడల నిర్వహణకు అక్రమ వసూళ్లకు పాల్పడలేదని ఇన్‌చార్జ్ ఎంఈవో పి.కృష్ణయ్య, క్రీడల కన్వీనర్ రాంబాబు తెలిపారు. తమపై కొందరు కావాలనే తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడల నిర్వహణ కోసం ఎంట్రీ ఫీజులు పెట్టామని కొంత మంది శ్రేయోభిలాషులు, విద్యావేత్తల సహకారం తీసుకొన్నామని వివరించారు. ప్రతిపైసాకు లెక్కలు ఉన్నాయని పేర్కొన్నారు.

●చుంచుపల్లి: కొత్తగూడెం మండల స్థాయి పాఠశాలల క్రీడా ఆవరణలో శుక్రవారం ఉదయం ప్రారంభం అయ్యాయి. తొలి రోజు బాలికల ఎంపికల ప్రక్రియ ప్రారంభిస్తూ ఎస్ఆర్ ప్రైమ్ స్కూల్ ప్రిన్సిపాల్ కె.క్రాంతికుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ క్రీడల్లో విజయం సాధించడం కన్నా పోటీల్లో పాల్గొనడం గొప్ప విషయమని అన్నారు. క్రీడల్లో జయ అపజయాలు సాధరణం అని, ఓడిన వారు కుంగిపోకుండా మరుసటి పోటీల్లో మెరుగైన ప్రదర్శనను కనబర్చి విజయం సాధించాలన్నారు. అనంతరం అండర్ -14, -17 బాలికల వాలీబాల్, కబడ్డీ, ఖో...ఖో.., అథ్లెటిక్స్‌లో ఎంపికలను నిర్వహించారు. శనివారం చుంచుపల్లి, కొత్తగూడెం మండలాలకు చెందిన బాలురకు ఎంపికలు నిర్వహించనున్నట్లు మండల విద్యాశాఖ అధికారి జుమికీలాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో సత్తా చాటిన అశోక్ కుమార్

● అశ్వారావుపేట టౌన్: ఏజెన్సీ గ్రామానికి చెందిన యువకుడు అశ్వారావుపేట మండల స్థాయి క్రీడా పోటీలలో ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచి తన సత్తా చాటాడు. అశ్వారావుపేట మండల స్థాయి క్రీడా పోటీలలో బీసీ బాలుర గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి కాత్రాల అశోక్ 10వ తరగతి చదువుతున్నాడు. క్రీడల్లో అత్యంత ప్రతిభ కనబరిచి ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచాడు. అండర్ 17 విభాగంలో కోకో, కబడ్డి జట్లకు కెప్టెన్‌గా వ్యవహరించి విజయం వైపుకి తీసుకవెళ్ళాడు అశోక్. అదేవిధంగా అథ్లెటిక్స్ రన్నింగ్ 100 మీటర్లు, 400 వందల మీటర్ల పరుగు పందెంలో ప్రథమ స్థానంలో నిలిచి జోనల్ మీట్‌కు ఎంపిక అయ్యాడు. అశోక్ కుమార్‌ను ఉపాధ్యాయులు, ప్రజలు, అధికారులు అభినందించారు.



పతకాలతో అశోక్‌కుమార్

అన్యాయంగా తొలగించారు..

- ఏకలవ్య మోడల్ స్కూల్ ఔట్‌సోర్సింగ్ హిందీ ఉపాధ్యాయుడు

టేకులపల్లి, సెప్టెంబరు 20: మండలంలోని బద్దుతండాలో నిర్వహిస్తున్న ఏకలవ్య మోడల్ స్కూల్లో హిందీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న తనను విధులనుంచి తొలగించారని సింగరేణి మండలం భాగ్యనగర్‌తండాకు చెందిన దివ్యాంగుడైన వాంకుడోతు ప్రేమ్‌లాల్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం టేకులపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. హిందీ పండిట్, బీఏ హిందీ, ఎంఏ పూర్తిచేసిన తను 2019 సెప్టెంబరు నుంచి 2023 వరకు దమ్మపేటలోని గిరిజన బాలుర రెసిడెన్సియల్ కాలేజీలో టీజీటీ హిందీ టీచర్‌గా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేశానని తెలిపాడు. 2023 సెప్టెంబరులో టేకులపల్లి ఏకలవ్య మోడల్ స్కూల్‌లో టీజీటీ హిందీ టీచర్‌గా నియమించారన్నారు. అక్కడ తనతో పాటు మరో హిందీ ఉపాధ్యాయురాలు కల్పన ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కాని ఈ విద్యా సంవత్సరం జూలైలో రెగ్యూలర్ టీజీటీ హిందీ టీచర్ ఇక్కడకు రావడంతో ఔట్‌సోర్సింగ్ పద్ధతిన పనిచేస్తున్న తమలో ఒకరిని తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. దీంతో తనతో పాటు మరో ఔట్‌సోర్సింగ్ టీచర్‌కు డెమోటెస్టు పెట్టి సర్టిఫికెట్స్ పరిశీలించారన్నారు. టీచింగ్ నైపుణ్యం, విద్యార్హతలు, డెమోటెస్టులో ప్రతిభ అన్నింటిని పరిశీలించి నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్(ఎన్ఈఎస్‌టీఎస్) నిబంధనల మేరకు తనను ఎంపిక చేశారని తెలిపారు. అప్పటి నుంచి తను విధులు నిర్వహిస్తున్నానని పేర్కొన్నాడు. కాని తను పనిచేస్తున్న పోస్టులో 2024 ఆగస్టు 30న భద్రాచలం ఐటీడీఏ పీవో కల్పనకు నియామక ఉత్తర్వులు జారీ చేశారని, ఆమె సెప్టెంబరు 12న విధుల్లో జాయిన్ అయ్యారని తెలిపారు. ఈ నెల 11 వరకు తను హిందీ ఉపాధ్యాయునిగా విధులు నిర్వహించానని, కాని కల్పన జాయిన్ కావడంతో తనను విధుల్లోకి రావద్దన్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. తనకు న్యాయం చేయాలని ఐటీడీఏ పీవోను స్వయంగా కలిసి తెలిపినప్పటికి పుట్టుకతో వికలాంగుడైన తనను కనికరించలేదన్నాడు. ఈ విషయంలో ఈఎంఆర్ఎస్ గురుకుల కార్యదర్శి, రీజనల్ కోఆర్డినేటర్ దృష్టికి తీసుకెళ్లతానన్నాడు. ఈ ఉద్యోగమే తనకు ఆధారమని, భార్య, ఇద్దరు పిల్లల పోషణ భారమవుతుందని కన్నీటి పర్యంతమయ్యాడు.



వివరాలు వెల్లడిస్తున్న ప్రేమ్‌లాల్

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జూలూరుపాడు, సెప్టెంబరు 20: మండలంలోని పడమటనర్సాపురం, జూలూరుపాడు, పాపకొల్లు సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలలో శనివారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ సతీష్ కుమార్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యుత్ లైన్లకు మరమ్మతులను చేపడుతుండటంతో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మానవీయ విలువలు పెంచేలా ఉండాలి: ఎమ్మెల్యే

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 20: విద్య ఉపాధితో పాటు మానవీయ విలువలు పెంచేలా ఉండాలని, జీవితంలో అత్యంత ముఖ్యమైన క్రమశిక్షణ అలవర్చుకున్నపుడు ఉత్తమ ఫలితాలు సాధించటానికి అవకాశం ఉంటుందని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. అశ్వారావుపేటలోని మహాత్మా జ్యోతిరావుపూలే తెలంగాణ బీసీ బాలికల, కళాశాలలో శుక్రవారం ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో వ్యక్తిత్వ వికాస శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇన్‌స్పైర్ అండ్ ఇగ్నైట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. ఫౌండేషన్ డైరెక్టర్ దాసరి రంజిత్ బృంద సభ్యులు సుధాకర్, ఉప్పు రాము విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కలిగించారు. ఉన్నత చదువులపై అవగాహన వాటి ప్రాముఖ్యత, ఉపాధి అవకాశాలు, మానవతా విలువలు, ఉపాధ్యాయులు తల్లిదండ్రుల గొప్పతనం, ఉత్తమ ఫలితాలు సాధించటానికి మెమరీ టెక్నిక్స్ క్రమశిక్షణతో పాటు అనేక అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే జారే మాట్లాడుతూ ఉన్నతమైన లక్ష్యంతో ముందుకు సాగితే ఊహించని విధంగా ఫలితాలు వస్తాయని, ఇప్పటి నుంచే ఒక లక్ష్యంతో ముందుకు సాగాలని తెలిపారు. విద్యార్థులు అన్ని అంశాలను మదింపు చేసుకుని కష్టపడి చదవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జారే, హాజరైన విద్యార్థులు

ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం

● పినపాక ఎమ్మెల్యే పాయం ● ఆళ్లపల్లిలో అధికారులతో సమీక్ష,

ఆళ్లపల్లి, సెప్టెంబరు 20: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందని, ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేస్తుందని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆళ్లపల్లి మండలంలోని పలు గ్రామాల్లో సీసీ రోడ్లను ప్రారంభించారు. అనంతరం మర్కోడు, రాఘవాపురం, పాతూరు, రామానుజగూడెం పంచాయతీల్లో నెలకొన్న సమస్యలపై అధికారులతో సమీక్ష నిర్వహించి, ప్రజల సమస్యలు తెలుకుసుకున్నారు. వారం రోజుల్లో వారి సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. మర్కోడు గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీల ఎగ్జిబిషన్‌ను ఎమ్మెల్యే సందర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ శకుంతల, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పాయం రామనర్సయ్య, అతహర్, పడిగ సమ్మయ్య, వాసం శ్రీకాంత్, భరత్, రవి, విరభద్రాచారీ, పర్విన్, సునిత, ముత్తిలింగం, పాపరావు, రేసు ఎల్లయ్య, వగలబోయిన సతీష్, వివిధ శాఖల అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



ఆళ్లపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం

హరిహరక్షేత్రం అభివృద్ధికి నిధులు కేటాయించాలి

ఇల్లెందుటౌన్, సెప్టెంబరు 20: ఇల్లెందు పట్టణంలోగల శ్రీ హరిహర క్షేత్రం దేవాలయ అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతు శుక్రవారం ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్యకు దేవాలయ చైర్మన్ గందే సదానందం ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. దేవాలయానికి మౌలిక వసతులతో పాటు, ఇతర సదుపాయలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దర్మకర్తల మండలి డైరెక్టర్లు కండె రమేష్, చంద్రశేఖర్, ఎల్లయ్య, విజయ, పద్మావతి, నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కనకయ్యకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పురుగుల మందుతాగి వ్యక్తి బలవన్మరణం

- శవాన్ని జోలెకట్టి వాగు దాటించిన గ్రామస్థులు



మృతదేహాన్ని జోలెలో తరలిస్తున్న దృశ్యం

ఆళ్లపల్లి, సెప్టెంబరు 20: పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న చేసుకున్న సంఘట ఆళ్లపల్లి మండలంలో గురువారం రాత్రి జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం ఆళ్లపల్లి మండలం, రాఘవాపూరం పంచాయతీ, చంద్రాపురం గ్రామానికి చెందిన చంద సమ్మయ్య(50) కుటుంబ సభ్యులు గురువారం రాత్రి దుక్కిటెద్దుల విషయంలో ఘర్షణ పడ్డారు. దాంతో సమ్మయ్య పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆళ్లపల్లి పీహెచ్‌సీకి తరలించగా, అక్కడ ప్రథమ చికిత్స అందించి, మెరుగైన వైద్యంకోసం కొత్తగూడెం ప్రభుత్వం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో సమ్మయ్య మృతి చెందాడు. శుక్రవారం కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ రతీష్ కేసు నమోదు చేసి మృతదేహానికి ఇల్లెందులో పోస్టుమార్టం నిర్వహించారు.

పరుగుల మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన సమయ్య మృతదేహాన్ని స్వగ్రామం చంద్రాపురం తీసుకెళ్లేందుకు గ్రామస్థులు నానా ఇబ్బందు పడ్డారు. చంద్రాపురం వెళ్లే మార్గ మధ్యలో జల్లెరువాగు అడ్డుగా ఉండటంతో వాహనాలు ఆ గ్రామానికి వెల్లే పరిస్థితి లేదు. దాంతో గ్రామస్థులు జోలె కట్టి శవాన్ని వాగుదాటించారు.

వృత్తివిద్యా కోర్సుల శిక్షణా శిబిరం ప్రారంభం

మణుగూరు, సెప్టెంబరు 20: సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలో శుక్రవారం పివీ కాలనీలోని సింగరేణి సేవా సమితి భవన్‌లో సింగరేణి పరిసర ప్రాంత నిరుద్యోగ మహిళల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వృత్తి విద్యా కోర్సుల శిక్షణా శిభిరాన్ని సేవా సమితి అధ్యక్షురాలు దుర్గం సుమతి ప్రారంభించారు. సమావేశంలో ఆమె మాట్లాడారు. నిరుద్యోగ మహిళలు తమ కాళ్లపై తాము నిలబడేందుకు ఇలాంటి వృత్తి విద్యాకోర్సులు ఎంతగానో ఉపయోగ పడతాయని తెలిపారు. ఉపాది లభించడంతో పాటు ఆర్థిక స్వాలంభన చేకూరుతుందన్నారు. హైదరాబాద్‌కు చెందిన ఖాదీ గ్రామోద్యోగ్ మహా విశ్వవిద్యాలయం పర్యవేక్షణలో శిక్షణ ఇవ్వడమే కాకుండా సర్టిఫికెట్లు కూడా ప్రదానం చేస్తామన్నారు. ఈ కార్యక్రమం లో ఏరియా డీజీఎం పర్సనల్ ఎస్ రమేష్, ఇల్లెందు లేడీస్‌క్లబ్ సెక్రటరీ కవిత శ్రీనివాసచారి, ఇల్లెందు లేడీస్ క్లబ్ సభ్యులు, సినియర్ పర్సనల్ మేనేజర్ సింగు శ్రీనివాస్. సేవా సెక్రటరీ, షాకీరా, పాల్గొన్నారు.

నేడు 25 అడుగుల భారీ గణపతి విగ్రహం నిమజ్జనం

కొత్తగూడెం సాంస్కృతికం, సెప్టెంబరు 20: పట్టణ పరిదిలోని కూలీలైన్ ఏరియా క్లాత్‌మార్కెట్ బిల్డింగ్ వద్ద గణపతి ఉత్సవకమిటి ఏర్పాటుచేసిన 25 అడుగుల భారీ గణనాథుడికి వైభవంగా శోయయాత్ర నిర్వహించి శనివారం భద్రాచలంలోని గోదావరిలో నిమజ్జనం చేయనున్నట్లు ఉత్సవ కమిటి సభ్యులు పబ్బా పవన్ తెలిపారు. ఎత్తైన విగ్రహం కావడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఈ నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. శుక్రవారం హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తిచేశారు.



వాగులు దాటి వైద్య శిబిరం

● కొమ్ముగూడెంలో వైద్య శిబిరం నిర్వహించిన వైద్యులు

కరకగూడెం, సెప్టెంబరు 20: మండలంలోని పలు గ్రామాలకు రహదారులు లేక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మండల వ్యాప్తంగా ప్రజలు అనేక రోగలతో సమస్యలు పడుతున్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వైద్యాధికారి కారం మధు ఆధ్వర్యంలో మారుమూల గ్రామాలలోని విశ్వనాధపురం, కొమ్ముగూడెం గ్రామాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ గ్రామాలకు రహదారులు లేక పోవడంతో వైద్యాధికారితో పాటు సిబ్బంది వాగుదాటి వెళ్లి వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 40 మందికి వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు 4 మంది జ్వరం ఉన్నట్లు గుర్తించి రక్త నమూనాలు తీసుకుని మందులు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో హెచ్ఈ క్రిష్ణయ్య, హెల్త్ అసిస్టేట్ కృష్ణ, ఏఎన్ఎం జ్యోతి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.



వాగుదాటుతున్న వైద్యులు

ముత్యాలమ్మ ఆలయ స్టీరింగ్ కమిటీ ఎన్నిక



స్టీరింగ్ కమిటీ సమావేశం దృశ్యం

దుమ్ముగూడెం సెప్టెంబరు 20: దుమ్ముగూడెం శ్రీ ముత్యాలమ్మ ఆలయ స్టీరింగ్ కమిటీ ఎన్నిక శుక్రవారం జరిగింది. సభ్యులుగా యలమంచి రవికుమార్, దల్లి అప్పలరెడ్డి, కొత్తూరి శీతారామారావు, కెల్లా వేణుగోపాల్, ముసలి రాంబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ సలహాదారులుగా భద్రాచలానికి చెందిన హలీంఖాన్, సీతారాంపురంకు చెందిన కొడాలి లోకేష్‌బాబు, ఆర్‌కొత్తగూడెంకు చెందిన సీతారామరాజులను ఎంపిక చేశారు. ఎన్నికైన స్టీరింగ్ కమిటీ గత జాతర జమ, ఖర్చుల పరిశీలన, నూతన పాలకవర్గం కమిటీ ఎంపిక భాద్యతలను చేపడతారు. మాజీ స్టీరింగ్ కమిటీ సభ్యులు శీరపు వెంకటరమణారెడ్డిను సన్మానించారు. గ్రామస్థులు, పెద్దలు పాల్గొన్నారు.

కరెంటు స్తంభాన్ని ఢీ కొట్టిన వ్యాను

పాల్వంచ, సెప్టెంబరు 20: డ్రైవర్ అజాగ్రత్తగా వ్యాను తోలడంతో అదుపుతప్పి కరెంటు స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదం శుక్రవారం తెల్లవారుజామున పాల్వంచ మండలం జగన్నాధపురం గ్రామంలో చోటు చేసుకుంది. కొండంగల్ బోడుకు చెందిన భూక్యా కిషన్ తన వ్యానులో భద్రాచలం నుంచి పాల్వంచ వైపు బయలుదేరాడు. తెల్లవారుజామున పాల్వంచ మండలం జగన్నాధపురం గ్రామం పెద్దమ్మగుడి ప్రాంతంలో అతి వేగంగా వ్యాను నడపడంతో అదుపుతప్పి జాతీయరహదారి ప్రక్కనే ఉన్న కరెంటు స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో ఆ స్తంబానికి అనుసందానంగా ఉన్న మరో మూడు స్తంబాలు పూర్తిగా ధ్వంసమయ్యాయి. అప్రమత్తమైన స్థానికులు విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో విద్యుత్ సరఫరాను నిలిపివేసారు. ఈప్రమాదం వలన విద్యుత్ శాఖకు రూ. 50వేల ఆస్తి నష్టం జరిగిందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రూరల్ ఏఈ రవీందర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వ్యాను డ్రైవర్ కం ఓనర్ భూక్యా కిషన్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్ఐ సురేష్ తెలిపారు.

నాటుసారా పట్టివేత

దుమ్ముగూడెం సెప్టెంబరు 20: మండలంలోని ములకపాడు, దుమ్ముగూడెం, నడికుడి గ్రామాలపై శుక్రవారం జిల్లా ఎక్సైజుశాఖ టాస్క్‌ఫోర్స్ విభాగం దాడులు జరిపింది. మూడు గ్రామాల్లో నలుగురు నాటుసారా విక్రేతలు పట్టుబడగా, వారి వద్ద రూ18,900ల విలువగల అరవై మూడు లీటర్ల నాటుసారా దొరికింది. దాడుల్లో ఎస్ఐ గౌతమ్, కానిస్టేబుళ్లు వెంకట్‌నారాయణ, సుమంత్, గురవయ్య, శ్రావణి తదితరులున్నారు.

45 కేజీల గంజాయి పట్టివేత

భద్రాచలం, సెప్టెంబరు 20: భద్రాచలంలోని చెక్‌పోస్టు వద్ద శుక్రవారం ఎక్సైజు ఎన్‌ఫోర్సుమెంటు అధికారులు 45 కేజీల గంజాయితో పాటు గంజాయి తరలిస్తున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి కారు స్వాధీనం చేసుకున్నారు. ఒడిసా రాష్ట్రంలోని కలిమెల ప్రాంతం నుంచి రాజస్థాన్‌కు భద్రాచలం మీదుగా గంజాయి తరలిస్తుండగా చెక్‌పోస్టు వద్ద ఎక్సైజ్ సీఐ శ్రీనివాస్ బృందం పట్టుకున్నారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్సుమెంటు సిబ్బంది బాలే. హన్మంతు, హరీష్, వెంకటేష్, విజయ్ ఉన్నారు.

కారు బోల్తా..నలుగురికి గాయాలు

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 20: కారు బోల్తా పడి నలుగురికి స్వల్పంగా గాయాలు అయిన ఘటన మండలంలో శుక్రవారం సాయంత్రం జరిగింది. అశ్వారావుపేట వైపు ఆంధ్రాలోని కుక్కునూరు వెళుతున్న కారు ఆసుపాక సమీపంలో అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకెళ్లింది. ప్రమాదంలో కారు పూర్తిగా దెబ్బతినగా నలుగురికి స్వల్పంగా గాయాలు అయ్యాయి.

మావోయిస్టు పార్టీ వార్షికోత్సవాలను ఘనంగా జరపండి

- వేర్వేరు లేఖల్లో అజ్ఞాత నాయకుల పిలుపు

పినపాక, సెప్టెంబరు 20: భారత కమ్యూనిస్టు మావోయిస్టు పార్టీ ఏర్పడి నేటికి 20 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా ఆవిర్భావ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని సీపీఐ మావోయిస్టు పార్టీ చర్ల - శబరి ఏరియా కమిటీ కార్యదర్శి అరుణ, జయశంకర్ - మంచిర్యాల - వరంగల్ - పెద్దపల్లి డివిజన్ కమిటీ కార్యదర్శి వెంకటేష్ శుక్రవారం వేర్వేరుగా పత్రికలకు లేఖలు విడుదల చేశారు. విడుదలైన లేఖల్లో గత రెండు దశాబ్దాలుగా సీపీఐ మావోయిస్టు పార్టీ ఎన్నో విజయాలు సాధించిందని, అదే సందర్భంలో కొందరు విప్లవ ద్రోహుల వల్ల ఒడిదుడుకులు ఎదుర్కొన్నదని లేఖలో పేర్కొన్నారు.

సీపీఐ మావోయిస్టు పార్టీ 20 వ స్థాపనా దినోత్సవాలను గ్రామగ్రామాన, పట్టణాల్లో ప్రజా మీటింగ్‌లు, పాటలు, నాటికలు, నృత్యాలతో ఉద్యమ స్ఫూర్తి చాటుతూ నేటి నుంచి అక్టోబరు 20 వరకు జరపాలని లేఖలో కోరారు. నూతన ప్రజాస్వామిక విప్లవం కోసం ప్రజా యుద్ధరంగంలో వీరోచితంగా పోరాడుతున్న పీఎల్‌జీఏ కమాండర్లకు, జైళ్లలో మొక్కవోని దీక్షతో పోరాడుతున్న విప్లవ సహచరులకు అభినందనలు తెలుపుతున్నట్లు లేఖలో పేర్కొన్నారు.

మొక్కలు నాటిన గ్రీన్ భద్రాద్రి సభ్యులు

భద్రాచలం, సెప్టెంబరు 20: భద్రాచలంలోని చర్ల ప్రధాన రహదారి వెంట గ్రీన్ భద్రాద్రి ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. సంస్థ అధ్యక్షుడు ఉమాశంకర్ నాయుడు మాట్లాడుతూ దాతల సహకారంతో పట్టణంలోని అన్ని కాలనీల్లో, రహదారుల వెంట వేలాది మొక్కలు నాటి సంరక్షించి పెద్ద వృక్షాలుగా మార్చామని అన్నారు. ఈ కార్యక్రమంలో పామరాజు తిరుమలరావు, హూసం రవికుమారి, బోనాల సూర్యనారాయణ, బెల్లంకొండ రాంబాబు, తుమ్మల రాణి పాల్గొన్నారు.

శాంతిని నెలకొల్పేందుకు ప్రవక్త బోధనలు దోహదపడతాయి

- సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా
- కొత్తగూడెం, మణుగూరులో ఘనంగా మహ్మద్ ప్రవక్త జన్మదినం

కొత్తగూడెం, సెప్టెంబరు 20(ఆంధ్రజ్యోతి): సమాజంలో శాంతిని నెలకొల్పేందుకు మహ్మద్ ప్రవక్త బోధనలు ఎంతగానో దోహద పడతాయని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కె సాబీర్‌పాషా అన్నారు. మహ్మద్ ప్రవక్త పుట్టిన రోజైన మిలాద్-ఉన్-నబి పండుగను పురస్కరించుకొని శుక్రవారం పట్టణంలో జూలూస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శాంతి, సౌభ్రాతృత్వంతో కూడిన మార్గంలో పయనిస్తే విద్వేషాలు లేని సమాజాన్ని నిర్మించవచ్చని, అందుకు ప్రతి ఒక్కరు కృషిచేయాలని తెలిపారు. మతవిద్వేషాలు దేశ పురోగతికి, సమాజ గమనానికి విఘాతం కలిగిస్తాయన్నారు.కార్యక్రమంలో ముస్లీం, మైనార్టీ సంఘాల రాష్ట్ర నాయకులు, షాదీఖానా, ఉర్దూఘర్ అధ్యక్షులు నయీమ్ ఖురేషి, కాంగ్రెస్ నాయకులు నాగసీతారాములు, ముస్లీం మైనార్టీ సంఘాల నాయకులు, మజీద్ కమిటీ నాయకులు పాల్గొన్నారు.

మణుగూరు పట్టణంలో మిలాదున్ నభీ ర్యాలీ

మణుగూరు,: మణుగూరులోని శేషగిరినగర్‌లో గల జామే మజీద్ కమిటీ, మత పెద్దల ఆధ్వర్యంలో మిలాన్ ఉద్ నబీ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ముస్లీం సోదరులు పెద్ద సంఖ్య లో చేరుకుని మజీద్ నుంచి మణుగూరు పట్టణంలోని అంబేద్కర్ సెంటర్ మీదుగా భారీ ప్రదర్శన నిర్వహించారు. మహ్మద్ ప్రవక్త జన్మదినం పురష్కరించుకుని ఆయన చూపిన మార్గంలో అంతా నడవాలని ఆకాంక్షించారు. ప్రేమ శాంతి సహనం కలిగిన జీవితాలను ప్రతి ఒక్కరు గడపాలని కోరారు. ఈ కార్యక్రమంలో మొయినుద్దీన్, ఇస్మాయిల్, జావిద్, ముస్తఫా, సిరాజ్ పాషా, నూరుద్దీన్, ఖాసిం, ఫజల్,హుస్సేన్, తదితరులు నాయకత్వాన్ని వహించారు.



మాట్లాడుతున్న సాబీర్‌పాషా

'పేరు మార్పును విరమించుకోవాలి'

అశ్వారావుపేట రూరల్, సెప్టెంబరు 20: హైదరాబాదులోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ పేరును సురవరం ప్రతాప్‌రెడ్డి యూనివర్సిటీగా మార్చటాన్ని విరమించుకోవాలని అశ్వారావుపేట ఆర్యవైశ్య సంఘం నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వాలు పొట్టి శ్రీరాములు పేరును తొలిగించటం తెలుగుజాతిని అవమానించటమేనని అన్నారు. దీనిని ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడు శీమకుర్తి శ్రీనివాసరావు, జిల్లా కోశాధికారి శీమకూర్తి తాతాశ్రీను, జిల్లా క్రీడా కమిటీ కన్వీనర్ ఉమామహేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు అశోక్‌నాథ్ గుప్త, సత్యనారాయణ ఉన్నారు.

స్వచ్ఛతను పాటించాలి

ఇల్లెందుటౌన్, సెప్టెంబరు 20: స్వచ్ఛతను పాటించి ఆరోగ్యాలను కాపాడుకోవాలని మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరావు సూచించారు. శుక్రవారం ఇల్లెందులో స్వచ్ఛత వారోత్సవాను ప్రారంభించి, ఆయన పనులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పట్టణంలో పారిశుద్ధ్య పనులు మెరుగు పరిచే విధంగా తగిన చర్యలు చేపట్టినట్టు తెలిపారు. మున్సిపల్ కమిషనర్ యాదగిరిరావు, మేనేజర్ అంకుశావళి, పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి: సీపీఎం

చుంచుపల్లి, సెప్టెంబరు 20: ఆరోగ్యశ్రీ సేవలందిస్తున్న ఆరోగ్య మిత్రల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు లిక్కి బాలరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్ వద్ద ఉద్యోగులు చేపట్టిన ధర్నాకి ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబరు 60 ప్రకారం 17 సంవత్సరాలు దాటిన ఉద్యోగస్తులను డీపీవోలుగా గుర్తించాలని కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆరోగ్యశ్రీ ఉద్యోగులు చేస్తున్న పోరాటం న్యాయమైనదని ప్రభుత్వం తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆరోగ్యశ్రీ ఉద్యోగస్తులు చేస్తున్న పోరాటానికి సీపీఎం సంపూర్ణ మద్దతు తెలియజేస్తూ వారికి అండగా ఉంటుందని ఆయన అన్నారు. ఆరోగ్య శ్రీ సేవలు పొందుతున్న ప్రజల మద్దతు కూడా కూడగట్టి భవిష్యత్తు పోరాటాల్లో భాగస్వామ్యం అవుతామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివైఎస్ఐ జిల్లా కార్యదర్శి కాలంగి హరికృష్ణ, నాయకులు చప్పిడి శ్రీనివాస్‌కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.